11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 123 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల గురువారం 8 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE 123 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA THU 8 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చు

### తెలంగాణతో నీటి వివాదాలపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

- కొందరు మాట్లాడుతున్న మాటలు తనకు అర్థం కావడం లేదని వ్యాఖ్య
- రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచొద్దని హితవు
- వైసీపీ అక్రమాలపై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడి
- రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపాటు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ సీఎం చంద్రబాబు ఈరోజు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ తెలంగాణతో నీటి వివాదాలపై సున్నితంగా, స్పష్టంగా స్పందించారు.గోదావరి నదిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చని చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పడం సరికాదని, నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దని తెలంగాణను కోరారు. "తెలుగు జాతి ఒక్కటే... ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి.

వివరాలు 2లో..




# పోలవరం పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష...

## నిర్వాసితులపై పూర్తి ఫోకస్ పెట్టాలని ఆదేశం

- మిగిలిన పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం
- నిర్వాసితుల పునరావాసంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని సూచన
- ఆర్ అండ్ ఆర్ పనులపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్న సీఎం
- మే మొదటి వారంలో మళ్లీ పనులను పరిశీలిస్తానని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై దృష్టి సారించారు. బుధవారం ఆయన ప్రాజెక్టు సైట్ వద్ద జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులో మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రాజెక్టులో ఇప్పటికే 87 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు.అదేవిధంగా పోలవరం ఎడమ కాలువ పనులను వేగవంతం చేయాలని సీఎం తెలిపారు. కుడి కాలువ ద్వారా కొల్లేరు ప్రాంతానికి కూడా నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కీలక సూచన చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి, నాదెండ్ల మనోహర్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వచ్చే మే నెల మొదటి వారంలో తాను మళ్లీ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేస్తానని చంద్రబాబు వెల్లడించారు.

## కేటీఆర్ ర్యాలీలో జగన్ జెండాలు

- ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో కేటీఆర్ ర్యాలీ
- ర్యాలీలో పాల్గొన్న వైసీపీ అభిమానులు, కార్యకర్తలు
- ఇటీవల జగన్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలో కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీలు



త**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన పర్యటనలో భాగంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెంలో ర్యాలీ నిర్వహించారు.

వివరాలు 2లో..

## చైనాలో మంచు సునామీ...



**పెన్ పవర్ డెస్క్:**గడ్డకట్టిన నది ఉన్నట్టుండి ఉప్పొంగింది.. మంచు కరిగి ప్రవాహాన్ని ముంచెత్తింది. శీతాకాలం కావడంతో పూర్తిగా మంచు పేరుకుపోయిన నదిని చూసేందుకు వచ్చిన పర్యాటకులు భయాందోళనకు గురయ్యారు. చైనాలోని జిన్ జియాంగ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు దీనిని 'మంచు సునామీ'గా అభివర్ణిస్తూ కామెంట్లు పెడుతున్నారు.

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసు...

### కోర్టుకు చేరిన ఎఫ్ఎస్ఎల్ కీలక నివేదిక

- నిందితుల మొబైల్ ఫోన్ల నుంచి డిజిటల్ ఆధారాల సేకరణ
- ఫోరెన్సిక్ నివేదికను సిట్ అధికారులు తీసుకునే అవకాశం
- పెద్ద పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను కుదిపేస్తున్న లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుల మొబైల్ ఫోన్ల నుంచి

వివరాలు 2లో..

## రాయలసీమ కట్టప్ప జగన్ రెడ్డి.. సీమ ద్రోహి

- 102 ప్రాజెక్టులు రద్దు చేసి సీమకు ద్రోహం చేశాడని మండిపాటు
- 2020లో స్టే ఇస్తే కౌంటర్ దాఖలు చేయలేని సీమ ద్రోహి అంటూ ఆగ్రహం
- అప్పర్ భద్రను జగన్ అడ్డుకోలేదని ఆరోపణ

**పెన్ పవర్ డెస్క్:**రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను 102 రద్దు చేసిన జగన్ రెడ్డి రాయలసీమకు కట్టప్పగా మిగిలిపోయారని, రాయలసీమ ద్రోహి జగన్ అని సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

వివరాలు 2లో..



## కుక్క ఏ మూడ్ లో ఉందో ఎవరూ ఊహించలేరు

- వీధి కుక్కల కేసు విచారణలో సుప్రీం కీలక వ్యాఖ్యలు
- కరిచినా, కరవకున్నా కుక్కల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వ్యాఖ్య
- వీధుల్లో, స్కూల్స్, విద్యా సంస్థల పరిసరాల్లో కుక్కలు ఉండాల్సిన అవసరమేంటని ప్రశ్న



**పెన్ పవర్ డెస్క్:**వీధి కుక్కలు ఎప్పుడు కరుస్తాయనే విషయం ఎవరూ ఊహించలేరని, వాటి మూడ్ ను అర్థం చేసుకోలేరని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వీధుల్లో సంచరించే కుక్కలు తరచూ వాహనాలకు అడ్డుపడి ప్రమాదాలకు కారణమవుతున్నాయని గుర్తుచేసింది. ఈ మేరకు

వివరాలు 2లో..

## 'ఐబొమ్మ' రవి బెయిల్ పిటిషన్ కొట్టివేత

- బెయిల్ కోసం నాంపల్లి కోర్టులో రవి పిటిషన్
- రవికి విదేశీ పౌరసత్వం ఉందని కోర్టుకు తెలిపిన పోలీసులు
- బెయిల్ ఇస్తే విదేశాలకు పరారయ్యే అవకాశం ఉందని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన కోర్టు.. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్ ను తోసిపుచ్చింది. సినిమా పైరసీ వెబ్ సైట్ 'ఐబొమ్మ' వ్యవహారంలో సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని అరెస్టు చేసిన పోలీసులు.. సైబర్ క్రైమ్ చట్టాల కింద ఐదు కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం జైలులో

వివరాలు 2లో..








## విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే.. ఏపీలో ఎన్‌హెచ్ఏఐ రెండు గిన్నిస్ రికార్డులు

- 24 గంటల్లో 28.95 లేన్-కిలోమీటర్ల బీటీ రోడ్డు వేసి అరుదైన ఘనత
- ఇది భారత్, ఏపీకి గర్వకారణమని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- ఈ మార్గంతో సగానికి తగ్గనున్న అమరావతి-బెంగళూరు ప్రయాణ సమయం

వివరాలు 2లో..

## రాజాసాబ్ ప్రీమియర్ షో టిట్.. ఏపీలో వెయ్యి రూపాయలు.. జీవో విడుదల



- సంక్రాంతి సినిమాల నిర్మాతలకు హైకోర్టులో ఊరట
- టిట్ రేట్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశం
- 'రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రాలకు మేలు
- సింగిల్ బెంచ్ తీర్పు ఈ చిత్రాలకు వర్తించదని స్పష్టం చేసిన కోర్టు

**పెన్ పవర్ డెస్క్:**మారుతి, ప్రభాస్ కాంబోలో తెరకెక్కిన సినిమా 'ది రాజా సాబ్'. ఈ సినిమా టికెట్ రేట్ల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జీవో విడుదల చేసింది. రాజాసాబ్ ప్రీమియర్ షో టికెట్ ధరను జీఎస్టీతో కలిపి వెయ్యి రూపాయలకు అమ్ముకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జనవరి 9న విడుదలవుతున్న 'ది రాజా సాబ్' సినిమాను.. ప్రీమియర్ షోతో

వివరాలు 2లో..

# విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే.. ఏపీలో ఎన్‌హెచ్‌ఏఐ రెండు గిన్నిస్ రికార్డులు

బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో భాగంగా ఏపీలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సృష్టించింది. ఇది భారత్‌కు, ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని సీఎం చంద్రబాబు తెలిపారు.
"బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ (NH`544G)లో వీ/ం రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా NHAI 24 గంటల్లోనే 28.95 లేన్-కిలోమీటర్ల పొడవున, 10,675 మెట్రిక్ టన్నుల తారు కాంక్రీట్‌ను నిరంతరాయంగా వేసి రెండు గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది" అని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ దార్శనికత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నాయకత్వంలో ప్రపంచస్థాయి రహదారుల నిర్మాణం, ఇంజినీర్లు, కార్మికుల అసాధారణ నిబద్ధత వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన
కొనియాడారు. ఇదే కారిడార్‌లోని ఇతర ప్యాకేజీలలో 2026 జనవరి 11 నాటికి మరో రెండు గిన్నిస్ రికార్డుల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. భారత్‌మాల ఫేజ్-×× కింద చేపట్టిన ఈ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం ఇటీవల వేగం పుంజుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నుంచి బెంగళూరుకు ప్రయాణ సమయం ప్రస్తుతం ఉన్న 11-12 గంటల నుంచి సుమారు 6 గంటలకు తగ్గనుంది. ఈ రహదారి ఏపీలోని
గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కడప జిల్లాల మీదుగా కర్ణాటకలోకి ప్రవేశిస్తుంది. మొత్తం 518 నుంచి 624 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిని సుమారు రూ.19,200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇందులో కోడికొండ నుంచి అద్దంకి/ముప్పవరం వరకు 342 కిలోమీటర్ల భాగం పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ కాగా, మిగిలిన భాగాన్ని బ్రౌన్‌ఫీల్డ్ పద్ధతిలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ఏపీ కనెక్టివిటీకి, సరుకు రవాణాకు కీలకం కానుంది.

## ఎడిటర్ వ్యూ

# భారతీయ గ్రంథాలు.. కీర్తి సంకేతాలు

అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అని ఆర్యోక్తి అక్షరం ఒక శక్తివంత మైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంధ పూజను పుస్తకాల (సరస్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వ హించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంధానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్ధశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి', పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్య శాస్త్రం', హాలుని 'గాధా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెప లాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. గ్రంథానికి మృతి లేదు. అక్షర రూపం దిద్దుకున్న ఆలోచన, రాసిన వసువును బట్టి ఎంతకాలం మన గలుగుతుందో నిర్ణయ మవుతుంది. తాళపత్ర, బూర్జ పత్ర, తామ్రపత్ర, చర్మపత్ర రూపాలలో ఉన్నవి శిథిలా లైతే, తిరిగి ప్రతి లేఖనాలవు తాయి. మనిషి అజ్ఞానంతోనో, తెలియకో, విలువ స్వార్థపరుడై విధ్వంసం చేస్తే తప్ప, తామ్ర, శిలా రూపాలకు చావే లేదు కదా. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన ఆరిస్టాటిల్, మన దేశ తత్వ సాహిత్యన్ని తిరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికుల సందర్శనలకు హేతువులైనాయి, చైనా, టిబెట్, ఆఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసు కెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శ్రాతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరి ణామ క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ప్రస్తానత్రయం, భారత భాగవత రామాయణాలు, ఉప పురాణాలు, స్మృతి గ్రంధాలు, భారతీయ కథా సాహిత్యం, గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపంచంలో ఏ జాతీ, ఏ దేశం, భారత దేశానికి సాటి రావని, సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృ తిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంధాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాల యాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడు కునేది. ముద్రణా యంత్రాల ఆధునీ కరణ జరిగింది. మరీ ముఖ్యంగా డిజిటలైజేషన్ వల్ల ముద్రణ నాణ్యమైన, అంద మైన ముద్రణలతో పాటుగా నేడు "ఈ గ్రంథాలు" ఉపయోగ పడు తున్నాయి. అయినా ముద్రిత గ్రంథ ఉపయోగం ఇంకా తగ్గు ముఖం పట్టలేదు. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవు తున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంధాలు, సృజనా త్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మి కాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటేమిటి... వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ఇలాంటి స్థితిలో పుస్తక ప్రదర్శన నిర్వహించడం చాలా ఉపయుక్తం. 1989 అక్టోబరు 29 నుంచి నవంబరు 8 వరకు విజయ వాడలో మొదటి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. 1980ల్లో రాజమండ్రిలో ఒక దశాబ్దం పాటు పుస్తక మహోత్సవాన్ని అక్కడి నిర్వాహకులు నిర్వహించారు. ఆ పుస్తక ప్రదర్శనలో భాగంగా విజయ వాడలోని ప్రముఖ ప్రచురణ కర్తలు పుస్తక దుకాణాల యజమానులు పాల్గొనేవారు. రాజమండ్రి పుస్తక ప్రదర్శన నిలిపి వేయడంతో నేషనల్ బుక్ ట్రస్ట్ సహాయంతో 1989 అక్టోబరు 29 నుంచి నవంబరు 8 వరకు విజయవాడలో మొదటి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఆ స్ఫూర్తితో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిఏటా విజయ వాడ పుస్తక మహోత్సవం గత 34 ఏళ్లుగా విజయ వాడ నగరంలో కొనసాగించడం అభినందనీయం. ఈ ఏడు జనవరి 2 నుంచి 12 వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విజయవాడ బుక్ ఎక్జిబిషన్ కొనసాగుతుంది. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి వడ్లమూడి విమలాదేవి, ప్రధాన సాహిత్య వేదికకు ప్రముఖ రచయిత డాక్టర్ బి.వి.పట్టాభిరామ్, ప్రతిభా వేదికకు ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ నార్లీకర్ పేర్లను ఈ ఏడాది పెట్టారు. ఈ ఏడాది 294 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈసారి ఎక్కువగా ఇంగ్లీషు బుక్ పబ్లిషర్లు రానున్నారు. పుస్తక ప్రదర్శనలో ఉండే స్టాళ్లలో ప్రతి పుస్తకంపై తప్పనిసరిగా 10శాతం రాయితీ ఇస్తారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. విజయవాడ 36వ పుస్తక మహోత్సవానికి భారీగా తరలివస్తున్న పుస్తక ప్రియులు, స్టాళ్లను పరిశీలించి, అభిరుచులకు తగ్గట్లు కొత్త పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీ వరకూ బుక్ ఫెయిర్ కొనసాగుతుంది. ఈనెల 12వ తేదీ వరకు జరగనున్న ఈ పుస్తక మహోత్సవంలో మొత్తం 314 స్టాళ్లను ఏర్పాటు చేశారు. రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుంది. శని, ఆదివారాల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటి గంటకే ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. నవలలు, జీవిత చరిత్రలు, కథలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, విప్లవ సాహిత్య పుస్తకాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. స్థానికులే కాకుండా పక్క జిల్లాల ప్రజలూ తరలివస్తున్నారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు అకడమిక్ పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు. బహు భాషలు, రచయితలు, గ్రంథాలు, ముద్రాపకులు, ఒక్కచోట చేరితే అదొక విజ్ఞాన విశ్వమే అవుతుంది. అందుకే చాలా మందికి ప్రీతిపాత్రం గ్రంథాల జాతరా. దేవున్ని జారతలో కొలిచినట్లే, గ్రంథాలను పరమ పవిత్రంగా భావించే సంస్కృతి భారతీయులది. కొనే వారు, చదివే వారు, సంరంభాన్ని కన్నుల పండువగా తిలకించే వారు, కౌటుంబిక, స్నేహ, ప్రేమికుల, విద్యార్థుల, రచయితల, కవుల, సాహితీ కారుల బృందాలు ఒక్క చోట కలిసి పండుగ చేసుకునే పుస్తక మేళాకు వెళ్ళిన వారికి మరచిపోలేని అనుభూతులను మిగులుస్తుంది అనేది నూటికి నూరు పాళ్ళు నిజం.

# సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చు

- మొదటి పేజి తరువాయి

రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచుకుని ఇతరులు ఆనందించే పరిస్థితి రావొద్దు" అని హితవు పలికారు. కొందరు మాట్లాడుతున్న మాటలు వింటుంటే... ఆ రాజకీయాలేమిటో తనకే అర్థం కావడం లేదని చంద్రబాబు అన్నారు. గోదావరి నది పైభాగంలో దేవాదుల ఉందని... దేవాదుల నుంచి నీళ్లు వస్తే కింద ఉన్న పోలవరానికే వస్తాయని, కిందికి వచ్చే నీళ్లకు అభ్యంతరం చెబితే అర్థమేమీ ఉండదని అన్నారు. తాము ఎప్పుడూ దేవాదులకు వ్యతిరేకం కాదని, తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కడుతున్నప్పుడు కూడా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు. నీళ్లు పొదుపు చేస్తే తెలంగాణకూ లాభమేనని, మిగులు నీటిని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వ చేసుకోవచ్చని సూచించారు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువగా ఉండటంతో పైన ప్రాజెక్టులు కడితే నష్టమని, కానీ గోదావరి డెల్టాను కాపాడుకుని కృష్ణా-గోదావరి అనుసంధానం చేస్తే ఇబ్బంది ఉండదని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై కొందరు చేస్తున్న వ్యాఖ్యల్లో అర్థం లేదని, అబద్ధాలను వందసార్లు చెబితే నిజమవుతుందని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు.
పోలవరం ఆలస్యంపై గత వైసీపీ ప్రభుత్వాన్ని చంద్రబాబు విమర్శించారు. గత ప్రభుత్వం వల్లే 6-7 ఏళ్లు ఆలస్యమైందని, డయాఫ్రం వాల్ పాడైందని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పిన తర్వాతే వాళ్లకు తెలిసిందని
విమర్శించారు. ఇప్పుడు కొత్తగా డయాఫ్రం వాల్ కడుతున్నామని, ఫిబ్రవరి 15లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని, కానీ దర్యాప్తు పేరుతో కాలయాపన చేసుకుంటూ పోతే, పనులు పూర్తి చేయడానికి చాలా కాలం పడుతుందని చెప్పారు. అనుమతులు లేని ప్రాజెక్టులకు రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టారని... ఎన్జీటీకి రూ. 100 కోట్ల జరిమానా కట్టారని దుయ్యబట్టారు.

# కుక్క ఏ మూడ్ లో ఉందో ఎవరూ ఊహించలేరు

- మొదటి పేజి తరువాయి

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో వీధి కుక్కలను షెల్టర్ హోంలకు తరలించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలపై దాఖలైన పిటిషన్ ను ధర్మాసనం ఈ రోజు విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. వీధుల్లో తిరిగే కుక్క కరుస్తుందని భావించినపుడు స్థానికులు అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. అధికారులు ఆ శునకాన్ని తీసుకువెళ్లి స్టెరిలైజ్ చేసి వదిలిపెడతారని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. స్టెరిలైజ్ చేశాక మనుషులను కరవకుండా వాటికి కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పడం మర్చిపోయినట్టున్నారని వ్యాఖ్యానించింది. మనుషులను కరవడం మాత్రమే కాదు.. వీధుల్లో కుక్కలు పరిగెత్తడం వల్ల వాహన ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని ధర్మాసనం గుర్తు చేసింది.
ప్రమాదం జరిగాక చికిత్స తీసుకోవడం కన్నా ముందే జాగ్రత్త పడడం మంచిదని ధర్మాసనం అభిప్రాయపడింది. వీధుల్లో, స్కూళ్లు, విద్యాసంస్థల
చుట్టుపక్కల కుక్కలు సంచరించాల్సిన అవసరం ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. వీధుల్లో సంచరించే ప్రతీ కుక్క మనుషులను కరవకపోవచ్చు కానీ రోడ్లపై అవి అడ్డదిడ్డంగా పరుగులు పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం మాత్రం ఉందని ధర్మాసనం పేర్కొంది.

# రాజాసాబ్ ప్రీమియర్ షో ట్టైట్.. ఏపీలో వెయ్యి రూపాయలు.. జీవో విడుదల

- మొదటి పేజి తరువాయి

ఏపీలో జనవరి 8న సాయంత్రం 6 గంటలకే ప్రదర్శించుకోవచ్చని ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. అర్ధరాత్రి 12 గంటల లోపు ప్రీమియర్ షోకు పర్మిషన్ ఇచ్చింది. ఈ లెక్కన చూసుకుంటే.. ఏపీలో జనవరి 8నే 'ది రాజా సాబ్' రెండు స్పెషల్ షోలు ప్రదర్శించే అవకాశాలున్నాయి. ఇక.. సినిమా విడుదలయిన రోజు నుంచి.. అంటే జనవరి 9 నుంచి పది రోజుల వరకూ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌యిపై 150 రూపాయలు, మల్టీప్లెక్స్‌శ్రీల్లో టికెట్‌శ్రీపై 200 రూపాయలు పెంచుకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రభాస్ హీరోగా మారుతి రూపొందిస్తున్న చిత్రం 'ది రాజా సాబ్'. ఈ సినిమా నుంచి 'నాచో.. నాచో' వీడియో సాంగ్ కూడా విడుదలైంది. 'రాజా సాబ్' ట్రైలర్ 2.ా పేరుతో మరో ట్రైలర్ విడుదలైన సంగతి తెలిసిందే. రాజాసాబ్‌కు నాయనమ్మ అయిన గంగమ్మ (జరీనా వాహబ్) అన్ని మర్చిపోతుంటుంది. కానీ తన భర్త (సంజయ్ దత్)ను మాత్రం మర్చిపోలేక ఇబ్బంది పడుతుంటుంది.
మిస్టీరియస్ పర్సన్ అయిన తన తాత గురించి తెలుసుకునేందుకు మయసభ లాంటి తాత హవేలీలోకి అడుగుపెడతాడు. అక్కడున్న వస్తువులు, పెయింటింగ్స్, ఆర్కిటెక్చర్ లాంటివన్నీ హిప్నటైజ్ చేసేలా డిజైన్ చేసి, అందులోకి అడుగుపెట్టిన వాళ్ల ట్రాన్స్‌లోకి వెళ్లేలా చేస్తాడు తాత.
అంతేకాదు దుష్ట శక్తులను ఆవాహనం చేసుకున్న తాత బంగ్లాలో అడుగడుగునా ప్రమాదాలే. అంత ప్రమాదకరమైన ఆ భవనంలోకి రాజా సాబ్ ఎందుకు వెళ్లాల్సి వచ్చింది... భూత ప్రేతాలు, హిప్నాటిజం చిక్కుముడుల నుంచి ఎలా బయటపట్టాడు అనేది అసలు కథ. ఓవైపు భయపడుతున్నట్టుగా, మరోవైపు ధీరుడిగా డిఫరెంట్ మేకోవర్స్‌తో ప్రభాస్ కనిపించాడు.

# కేటీఆర్ ర్యాలీలో జగన్ జెండాలు

- మొదటి పేజి తరువాయి

ఈ ర్యాలీలో అనూహ్యంగా ఏపీ మాజీ సీఎం జగన్ ఫొటోలు, వైసీపీ జెండాలు కనిపించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. వైసీపీ కార్యకర్తలు, అభిమానులు కూడా ఈ ర్యాలీలో పాల్గొని జై జగన్, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. రెండు పార్టీల మధ్య స్నేహబంధాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయి. బీఆర్ఎస్, వైసీపీ పార్టీల మధ్య ముందు నుంచి మంచి సంబంధాలు ఉన్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా కేసీఆర్, జగన్ మధ్య స్నేహపూర్వక వాతావరణం కొనసాగింది. రాజకీయ విషయాల్లో ఒకరికొకరు మద్దతు తెలుపుకునేవారు. ఇటీవల జగన్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలో జగన్ నివాసం వద్ద కేసీఆర్, కేటీఆర్, జగన్ ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ సందర్భంగా రెండు పార్టీల సాన్నిహిత్యం మరోసారి బయటపడింది.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసు... కోర్టుకు చేరిన ఎఫ్‌ఎస్‌ఎల్ కీలక నివేదిక

- మొదటి పేజి తరువాయి

సేకరించిన డిజిటల్ ఆధారాలపై ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఖీూూ) నివేదిక కోర్టుకు చేరింది. ఈ నివేదికను సిట్ అధికారులు తీసుకునే అవకాశం ఉంది. స్కామ్ బయటపడిన వెంటనే చాలా మంది నిందితులు తమ మొబైల్ ఫోన్లను ధ్వంసం చేశారని, రీసెట్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. అయినా ఆధునిక ఫోరెన్సిక్ సాంకేతికతతో డిలీట్ అయిన డేటా, కాల్ రికార్డులు, చాట్స్, ఫైల్స్‌ను రికవరీ చేసినట్లు సమాచారం. ఈ రికవరీ డేటాలో ఏం ఉందో తెలిస్తే కేసు మరింత లోతుగా సాగే అవకాశం ఉంది. ఈ రిపోర్ట్ సిట్ చేతికి అందితే... ఆర్థిక లావాదేవీలు, రాజకీయ నాయకులతో సంబంధాలు, లంచాలకు సంబంధించిన ఆధారాలు వెలుగులోకి రావచ్చు. దీంతో ఇప్పటికే నిందితులుగా ఉన్నవారితో పాటు మరికొందరి పెద్ద పేర్లు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నివేదికలో ఏం బయటపడుతుందోనని రాజకీయ నాయకులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు.

# 'ఐబొమ్మ' రవి బెయిల్ పిటిషన్ కొట్టివేత

- మొదటి పేజి తరువాయి

ఉన్న రవి బెయిల్ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు.
ఈ పిటిషన్ విచారణ సందర్భంగా రవిపై నమోదైన కేసులు ప్రస్తుతం విచారణ దశలో ఉన్నాయని పోలీసులు కోర్టుకు వెల్లడించారు. రవికి విదేశాల్లో పౌరసత్వం ఉందని కోర్టు దృష్టికి తీస్కుళ్లారు. బెయిల్ మంజూరు చేస్తే రవి విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని తెలిపారు. దీంతో న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

# రాయలసీమ కట్టప్ప జగన్ రెడ్డి.. సీమ ద్రోహి

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాయలసీమ ప్రాజెక్టులకు సంబంధించిన కాలువలను వెడల్పు చేసి ఎక్కువ నీటి సామర్థ్యంతో సీమ రైతాంగానికి నీరందించాలనే ఆలోచన జగన్ ఐదేళ్ల పాలనలో చేయలేదు. కొత్త రిజర్వాయర్లు కట్టాలి. ఉన్న రిజర్వాయర్లను రిపేరు చేయాలి. దీని ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. ఆ పని జగన్ చేయలేదు. కానీ ముఖ్యమంత్రి అయిన వెంటనే జీఓ 365 తెచ్చి 102 ప్రాజెక్టులను రద్దు చేసి రాయలసీమకు, సీమ రైతాంగానికి తీరని ద్రోహం చేశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 2020లో రాయలసీమ ఎత్తిపోతలపై స్టే

రాయలసీమ ఎత్తిపోతల పథకంపై 2020లోనే స్టే తెచ్చామని తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు చెప్పారని, మరి నాలుగేళ్లు అధికారంలో ఉన్న జగన్ రెడ్డి ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. దీన్ని బట్టి అబద్ధాలు చెప్పుకుంటూ టీడీపీపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. నాలుగేళ్లు కౌంటర్ దాఖలు చేయలేకపోవడంతో నిజమైన రాయలసీమ ద్రోహులు మీరు కాదా అని నిలదీశారు. రెండు రాష్ట్రాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలన్నదే జగన్ ధ్యేయమని ధ్వజమెత్తారు. కృష్ణా జలాలు ఒక్క గ్రావిటీలోనే తీసుకోగలమని, కేఆర్ఎంబీ పర్మిషన్ లేదు, కేంద్రం అనుమతిలేదు, గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులు లేవని, ఎందుకు ప్రారంభించారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వందలాది కోట్లు దుబారా చేశారని, ఇదంతా జగన్ దోపిడీకి నిదర్శనమని ఆరోపించారు. దోచుకొని రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విభేధాలు సృష్టించి రెండు రాష్ట్రాల్లో రాజకీయంగా లబ్ది పొందాలనే దురుద్దేశంతోనే ఇదంతా చేశారని ఆయన అన్నారు. రాయలసీమకు నిజమైన ద్రోహి జగన్ రెడ్డేనని, కట్టప్ప ఎలా వెనుకనుంచి పొడిచాడో ఆ విధంగా రాయలసీమ ప్రజలకు ద్రోహం చేశాడని అన్నారు. ముచ్చుమర్రికి సంబంధించిన 13 పంపులకు కరెంట్ బిల్లులు కూడా జగన్ కట్టలేదని మండిపడ్డారు. అనుమతులు లేకుండానే రాయసీమ ఎత్తిపోతలకు రూ.990 కోట్లు ఎందుకు ఖర్చు చేశావని ప్రశ్నించారు. ఇలాంటి నీతిలేని వారికి ప్రజలు ఇప్పటికే 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు.

### అప్పర్ భద్రను జగన్ అడ్డుకోలేదు

"అప్పర్ తుంగ, అప్పర్ భద్ర ప్రాజెక్టులను కర్ణాటక ప్రభుత్వం కడుతున్నా జగన్ రెడ్డి అడ్డుకోలేదు. కనీసం అభ్యంతరం కూడా చెప్పలేదు. అలగనూరు కుంగింది. రూ.36 కోట్లు కేటాయిస్తే పోయేది కానీ జగన్ ఒక్కరూపాయి ఇవ్వలేదు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మంది చనిపోవడానికి కారణం జగన్. శ్రీశైలం డ్యామ్ రిస్క్‌లో పడే పరిస్థితి వచ్చింది. కొత్తవి కట్టడం కాదు ఉన్న ప్రాజెక్టులను పట్టించుకోలేదు. హంద్రీనీవాను జగన్ రెడ్డి హయాంలో ఎందుకు ఆధునీకీకరించలేదు" అని విమర్శించారు.

### వైసీపీ బతుకే ఫేక్ ప్రచారం

"సాక్షి పత్రిక, బ్లూ మీడియా, పేటియం బ్యాచ్‌లు చేసే ఫేక్ ప్రచారాలు ఏది వాస్తవమో, ఏది అవాస్తవమో తెలియక ప్రజలు అయోమయానికి గురయ్యే ఆస్కారం ఉంది. వైఎస్ వివేకాను చంపి నారాసుర రక్త చరిత్ర అని వారి పత్రికలో వారే వేసుకున్నారు. శ్రీవారి పింక్ డైమెండ్ చంద్రబాబు ఇంట్లో ఉందని చెప్పి అధికారంలోకి రాగానే ఆ కేసు ఉపసంహరించుకున్నారు. 300కు పైగా ఆలయాలపై దాడులు చేసి ధ్వంసం చేశారు. ఏమీ తెలియనట్లు, మాకు సంబంధం లేనట్లు ఉన్నారు. రాజశేఖర్ రెడ్డిని చంపింది రిలయన్స్ వాళ్లంటూ ప్రచారం చేసి అదే అంబానీ కుమారుడిని ఇంటికి ఆహ్వానించి కౌగిలించుకొని వారి మనిషికి ఎంపీ పదవిని కట్టబెట్టిన చరిత్ర వైసీపీది. వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి, ఇతర 700లకు పైగా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా పట్టించుకోకుండా ప్రజల్ని మోసం చేసిన చరిత్ర జగన్‌ది. వై నాట్ 175 అనే నినాదంతో నేడు 11 సీట్లకు పరిమితం అయ్యారు. పులివెందుల ఎమ్మెల్యేగా మిగిలిపోయి కర్నాటక వాస్తవ్యుడు జగన్. ఎన్నికలప్పుడు సిద్ధం సిద్ధం అని చెప్పి హోర్డింగ్స్ పెట్టారు. ఆ పార్టీ ప్యాకప్ అయ్యేందుకు సిద్ధమని సందేశమిచ్చారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శలు చేస్తున్నారు. నిజంగా రెడ్ బుక్ ఉంటే అంకుశం సినిమాలో రామిరెడ్డిని నడిరోడ్డుపై అండర్ వేర్ తో ఎలా నడిపించుకొని తీసుకెళ్లారో అలా కొడాలి నానిని నడిపించేవాళ్లం. అలాంటి కక్ష రాజకీయాలు లేవని రుజువైంది. ఇంటి ముందు ఏ చిన్న అలికిడి వచ్చినా కొడాలి నాని భయపడిపోతున్నాడు. నేడు కొడాలి నాని పరిస్థితి కోడికి ఈకలు పీకేసినట్లైంది. అది లోకేశ్ పవర్" అని వ్యాఖ్యానించారు.

# బి.పి.ఎస్, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి.

**అద్దంకిలో టౌన్ ప్లానింగ్ ఆర్డీ మధు**

అద్దంకి, పెన్ పవర్ ప్రతినిధిజనవరి 7: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో బి.పి.ఎస్, ఎల్.ఆర్.ఎస్ పథకాల అమలు తీరుపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ మధు ముఖ్య అతిథిగా హాజరై, పథకాల పురోగతిని పరిశీలించారు. ఆర్డీ మధు మాట్లాడుతూ... భవన, లేఅవుట్ క్రమబద్ధీకరణకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, టీ.పీ.వో లక్ష్మిలతో కలిసి వార్డ్ ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్ టెక్నికల్ పర్సనల్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# గుంటూరు జిల్లాలో గంజాయి నిర్మూలనకు విస్తృత కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహణ..





పెన్ పవర్, గుంటూరు, జనవరి, 07.గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ , గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాలో గంజాయి నిర్మూలన లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు చేపడుతున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.గంజాయి కేసుల్లో గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, గంజాయి కార్యకలాపాల్లో పాల్గొంటున్న అనుమానితులు, రౌడీ షీటర్ల నివాసాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో, తెల్లవారుజామున గుంటూరు ఈస్ట్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని లాలాపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన ఐపీడీ కాలనీ, గాంధీ నగర్ ప్రాంతాల్లో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ నేతృత్వంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు.అనంతరం స్థానిక ప్రజలకు గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు "సంకల్పం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ స్వయంగా పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఇటీవల గంజాయి వినియోగం పెరుగుతోందని, ముఖ్యంగా యువత ఈ మత్తుకు అలవాటుపడుతున్నారని, ఇది అత్యంత ప్రమాదకర పరిణామమని పేర్కొన్నారు. గంజాయి ఒకసారి అలవాటైతే వ్యసనంగా మారి, శారీరక-మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని తెలిపారు. అంతేకాకుండా చట్టపరమైన కేసులు నమోదై, జీవితాంతం పోలీస్ రికార్డుల్లో పేరు నిలిచిపోతుందని, ఉద్యోగావకాశాలు కూడా కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఎవరిపై అయినా రెండు లేదా అంతకంటే ఎక్కువ గంజాయి కేసులు నమోదైతే రౌడీ షీట్ తెరవబడుతుందని, అదే పనిగా గంజాయి కార్యకలాపాల్లో పాల్గొంటే పీడీ చట్టం కింద అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు.గంజాయి సేవించడం, అమ్మకం, సరఫరా అనేవి చట్టరీత్యా నేరమేనని, గంజాయి కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం పోలీసులకు అందించిన ప్రజలకు గోప్యత కల్పించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల భద్రత, స్వేచ్ఛలను పరిరక్షించేందుకు "సంకల్పం" కార్యక్రమం ద్వారా ప్రతి పాఠశాల, కళాశాల, గ్రామం, వార్డులో మాదక ద్రవ్యాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నేరాల నియంత్రణకు ప్రజలు తమ ఇళ్ల వద్ద, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వీటివల్ల నేరస్తులను త్వరగా గుర్తించి కేసులు సమర్థవంతంగా ఛేధించవచ్చని సూచించారు.అదేవిధంగా, తెనాలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని తెనాలి 3వ పట్టణం, సీఎం కాలనీలో డీఎస్పీ జనార్ధన్ రావు ఆధ్వర్యంలో ఈ రోజు తెల్లవారుజామున కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో "సంకల్పం" కార్యక్రమం నిర్వహించి, యువత గంజాయికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గంజాయి వల్ల జీవితాలు నాశనం అవుతాయని, శారీరక-మానసికంగా తీవ్రమైన నష్టం కలుగుతుందని వివరించారు.మైనర్ పిల్లలకు మోటార్ వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. సీఎం కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లో సరైన వాహన ధ్రువపత్రాలు లేని 55 ద్విచక్ర వాహనాలు గుర్తించగా, తెనాలి 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 45 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు గుర్తించబడినట్లు పోలీసులు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి అభ్యర్థులే దొరకరు

**-:ప్రత్తిపాటిపార్టీని, కార్యకర్తల్ని పట్టించుకోకుండా ప్రభుత్వంపై బురదజల్లడమే జగన్ పనిగా పెట్టుకున్నాడు**

**-: ప్రత్తిపాటి.జగన్ వ్యవహారశైలి, ప్రభుత్వంపై విమర్శలు సహించలేకే వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు**

**- : ప్రత్తిపాటి.గతంలో వైసీపీ బెదిరింపులు, ప్రలోభాలతో ఆపార్టీలోకి వెళ్లిన 200 మంది టీడీపీ కార్యకర్తలు...**

**నేడు తమ సొంతింటికి రావడంపై హర్షం వ్యక్తంచేసిన మాజీమంత్రి ప్రత్తిపాటి.**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 07 : చిలకలూరిపేట: అధికారంలో ఉన్నప్పుడు ప్రచారపిచ్చితో, 11 స్థానాలకు పరిమితమయ్యాక విమర్శలు, విషప్రచారంతో పార్టీని, కార్యకర్తల్ని జగన్ పూర్తిగా విస్మరించాడని, తమ గోడు వినేవారు లేక, దిక్కుతోచని స్థితిలో వైసీపీ కేడర్ పక్కచూపులు చూస్తోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.నాదెండ్ల మండలం చిరుమామిళ్లకు చెందిన 70 వైసీపీ కుటుంబాలు బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో తిరిగి మాజీమంత్రి ప్రత్తిపాటి సమక్షంలో మరలా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గిరిజన పెద్దలు మొగిలి శ్రీనివాసరావు, తోకల వీరస్వామి, మొగిలి నాగయ్య, కోటేశ్వరరావు మరియు ఇతర కార్యకర్తల కుటుంబాలకు చెందిన సుమారు 200 మంది వైసీపీ కార్యకర్తలకు తెలుగుదేశం కండువాలు కప్పిన ప్రత్తిపాటి, వారిని ప్రేమగా సొంత కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు.. కూటమి ప్రభుత్వంపై విమర్శలతో జగన్ ప్రజల్లో, పార్టీలో పలుచన అవుతున్నారుప్రజల్ని, రాష్ట్రాన్ని విచ్చలవిడిగా దోచేసినందుకే ప్రజలు తనను ఇంటికి పంపారనే కనీస ఇంగితం లేకుండా, అధికారం దక్కలేదన్న అక్కసుతో జగన్ నిత్యం కూటమిప్రభుత్వంపై కువిమర్శలు చేస్తూ ప్రజల దృష్టిలో, సొంత పార్టీలో పలచన అవుతున్నాడని ప్రత్తిపాటి ఎద్దేవాచేశారు. జగన్ వ్యవహారశైలి ఇలానే కొనసాగితే, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి వైసీపీకి అభ్యర్థులే దొరకరని ఆయన స్పష్టంచేశారు. గతంలో టీడీపీ మద్దతుదారులైన గిరిజనుల్ని గత పాలకులు ప్రలోభాలకు గురిచేసి, భయపెట్టి తమ పార్టీలోకి తీసుకున్నారని, వారికి ఇళ్లు, ఇళ్లపట్టాలు ఇస్తామని చెప్పి మోసగించారని, వారంతా నేడు మరలా టీడీపీలోకి రావడం సంతోషకరమని ప్రత్తిపాటి తెలిపారు.ఇళ్ల పట్టాల పేరుతో మాజీమంత్రి రజనీ తమను మోసగించి డబ్బులు తీసుకున్నారు మాజీమంత్రి విడదల రజనీ మంత్రిగా ఉన్న సమయంలో తమను ఇబ్బందిపెట్టి, భయపెట్టి వైసీపీలోకి వెళ్లేలా చేశారని, ఇళ్ల పట్టాల పేరుతో ఒక్కోకుటుంబం నుంచి తమ వద్ద రూ.20వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేశారని నాదెండ్ల మండలం చిరుమామిళ్లకు చెందిన హరికృష్ణ చెప్పారు. ఆనాడు రజనీ బెదిరింపులకు భయపడి టీడీపీని వీడి, వైసీపీలో చేరిన 70 గిరిజన కుటుంబాలకు చెందిన 200 మంది కార్యకర్తలం నేడు ఎమ్మెల్యే ప్రత్తిపాటి సమక్షంలో సంతోషంగా టీడీపీలో చేరామని హరికృష్ణ తెలిపారు. చంద్రబాబు నాయకత్వ పనితీరు, సమర్థత.. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అభివృద్ధి చేస్తున్నతీరు బాగున్నాయని పార్టీలోకి వచ్చినవారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, నాదెండ్ల మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, దగ్గుమల్లి సాంబశివరావు, భవనం శ్రీనివాస్ రెడ్డి, గంట వెంకట హరికృష్ణ యాదవ్, దగ్గుమలి సాంబశివరావు, గుర్రం ఉపేంద్ర , మావులపల్లి పోతురాజు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# ఎడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ జూదం..

## ఏడుగురు అరెస్ట్, రూ.31,450 స్వాధీనం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 07 : ఎడ్లపాడు: పోలీస్ స్టేషన్ పరిధిలోని వంకాయలపాడు గ్రామ శివారు ప్రాంతంలో అక్రమంగా జూదం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. దాడిలో జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.31,450 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఈ శివరామకృష్ణ మాట్లాడుతూ ఘటనకు సంబంధించి చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని తెలిపారు.అక్రమ కార్యకలాపాలు, ముఖ్యంగా జూదం వంటి నేరాల్లో ఎవరూ పాల్గొనరాదని ప్రజలకు సూచించారు.అలాగే గ్రామాలలో ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం లభించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు. పోలీసులు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ముగిసిన ధనుర్మాస జయంతి ఉత్సవాలు.



భట్టిప్రోలు, పెన్ పవర్ జనవరి, 07:మండల కేంద్రమైన భట్టిప్రోలు లో వేంచేసి ఉన్న శ్రీ షిరిడి సాయి.. శ్రీదత్తాత్రేయ స్వామి వారి ఆలయంలో ధనుర్మాస జయంతి ఉత్సవాలు మరియు 81 వ వార్షికోత్సవం బుధవారం నాటికి నాటికి ఆరవ రోజుకు చేరి ముగిశాయి.ఉదయం స్వామివారికి సుప్రభాతం, కాగడా హారతి నిర్వహించారు. సాయినాధునకు సుగంధ ద్రవ్యాలతో పంచామృతాలతో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.ఈ పూజలో ఆత్మూరి వాళేశ్వరరావు..భవాని,తూనుగుంట్ల గంగాధరరావు..శ్రీవాణి దంపతులు పాల్గొని పూజలను నిర్వహించారు.అనంతరం స్వామివారికి మధ్యాహ్న హారతిని సమర్పించారు. సాధనమండలి బ్రహ్మ విద్యాసం ఆధ్వర్యంలో నారాయణ ఉపనిషత్తు,అమృత బింధో పనిషత్తు,గీతా పారాయణ తత్వము సారాంశము నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో నారాయణ సేవ(అన్న ప్రసాద వితరణ) వెయ్యి మందికి నిర్వహించారు.ఈ కార్యక్రమాలను దేవాలయ అధ్యక్షులు తమ్మన రమేష్ బాబు, మెంటా సాంబశివరావు, కూరాళ్ళ రవికుమార్,బూర్లే కిరణ్ కుమార్,బట్టు రమేష్ బాబు తదితరులు పర్యవేక్షించారు.

# రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు

## -జిల్లా కలెక్టర్ శ్రీమతి కృత్తికా శుక్లా




నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి జనవరి 7: పల్నాడు జిల్లా, నరసరావుపేట లో బుధవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు భద్రత (రోడ్ సేఫ్టీ)పై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా యువత రోడ్డు భద్రతపై బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి, రోడ్డు భద్రతకు సహకరించాలని అధికారులు ఈ సందర్భంగా ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ ఎన్జీవో ప్రతినిధులు, డీఎస్పీ హనుమంతరావు, గురజాల డీఎస్పీ జగదీష్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సంజీవ్ కుమార్, ఆర్టీఓ శివ నాగమల్లేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ లోకనాథం తదితర అధికారులు పాల్గొన్నారు.

# నూతన రోడ్ల నిర్మాణ పనుల్ని సకాలంలో పూర్తి చేయండి: ప్రత్తిపాటి

**-దింతెనపాడు -సాతులూరు, చిలకలూరిపేట- నరసరావుపేట (కోటప్పకొండ), సంక్రాంతి పాడు నుంచి కొండవీడు కోట అనుసంధాన రోడ్లు వేగంగా పూర్తికావాలి.**

**18 నెలల్లో నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణం, మరమ్మ్మతులకు రూ.30 కోట్లు మంజూరు.నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణం, మరమ్మ్మతులపై ఆర్ & బీ అధికారులతో మాజీమంత్రి ప్రత్తిపాటి సమీక్ష.**



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 07 : చిలకలూరిపేట: రోడ్లు భవనాల శాఖ పరిధిలో నియోజకవర్గంలో ఎక్కడా రోడ్లకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని, కొత్తగా మంజూరైన రోడ్లను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, కూటమిప్రభుత్వంలో రోడ్ల సమస్య ఉండటానికి వీల్లేదని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టంచేశారు. బుధవారం ఆయన తన నివాసంలో నరసరావుపేట డివిజన్ ఆర్&బీ అధికారులతో నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణం, మరమ్మ్మతులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు కీలక సూచనలు చేశారుకొత్తగా నిధులు మంజూరైన దింతెనపాడు-సాతులూరు (రూ. 5కోట్ల వ్యయం), చిలకలూరిపేట-నరసరావుపేట (వయా కోటప్పకొండ) (రూ. 4కోట్లు), సంక్రాంతి పాడు (ఇస్కాన్ టెంపుల్) నుంచి కొండవీడు కోట (రూ. 1.45 కోట్లు) రోడ్లను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రత్తిపాటి అధికారుల్ని ఆదేశించారు. టెండర్ల ప్రక్రియ పూర్తైనందున, గుత్తేదారుల్ని సంప్రదించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. అలానే శివరాత్రి నాటికి చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి కోటప్పకొండకు వెళ్లే ప్రతి ప్రధాన రోడ్డు బాగుండాలని, ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని ప్రత్తిపాటి అధికారుల్ని ఆదేశించారు.నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా రోడ్ల నిర్మాణం, మరమ్మతులు పూర్తి చేయండికూటమిప్రభుత్వంలో రోడ్ల నిర్మాణం, మరమ్మ్మతులకు సంబంధించి ప్రజలనుంచి ఎలాంటి ఫిర్యాదులు రావడానికి వీల్లేదన్న ప్రత్తిపాటి, రోడ్ల పనుల్లో అధికార యంత్రాంగం నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా చూడాలన్నారు. ఈ 18 నెలల్లో నియోజకవర్గంలోని ఆర్ &బీ రోడ్ల నిర్మాణం, మరమ్మ్మతులకు ప్రభుత్వం నుంచి రూ. 30 కోట్లు మంజూరయ్యాయని, నిధుల్ని సకాలంలో సద్వినియోగం చేసి, ప్రజల బాధలు తొలగించామని ప్రత్తిపాటి, అధికారులకు చెప్పారు. తాజాగా మంజూరైన కొత్త రోడ్లు పూర్తయితే, చిలకలూరిపేట పరిధిలోని మొత్తం 250 కిలోమీటర్ల ఆర్ & బీ రోడ్లన్నీ మెరుగుపడతాయన్నారు. రహదారి సౌకర్యాల కల్పనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎట్టిపరిస్థితుల్లో రాజీపడరని, అలాంటి నాయకుడి హాయాంలో ప్రజలకు రోడ్ల సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. సమీక్ష సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, యడ్లపాడు మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు ముద్దన నాగేశ్వరరావు, గట్టినేని రమేష్, మద్దినిడి శివరామకృష్ణ, ఆర్ & బీ ఈఈ గీతారాణి, డీ.ఈ నరేంద్ర రెడ్డి, ఏఈఈ సురేశ్ ఇతర సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వర్ధంతి నుంచి లోకేశ్ జన్మదినం వరకు జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

**- సంక్రాంతి ముగిసిన వెంటనే ప్రారంభమయ్యే పోటీలతో రైతులు, ప్రజలకు సంతోషం, ఉత్సాహం.స్థానిక గోల్కోండ గార్డెన్స్ లో ఎడ్ల పోటీల నిర్వహణ పనులు ప్రారంభించిన మాజీమంత్రి ప్రత్తిపాటి.**



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 07 : చిలకలూరిపేట: తెలుగువారి ఆరాధ్య దైవం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి (జనవరి 18) నుంచి, భవిష్యత్ నాయకుడు మంత్రి నారాలోకేశ్ జన్మదినం (జనవరి 23) వరకు చిలకలూరిపేటలో జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్టు మాజీమంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.ఎడ్ల పోటీలతో రైతులకు, ప్రజలకు ఎనలేని ఆనందం..ఉత్సాహంబుధవారం ఆయన ఎడ్ల బలప్రదర్శన పోటీల ఏర్పాట్ల పనుల్ని ప్రారంభించి, మీడియాతో మాట్లాడారు. చిలకలూరిపేటలోని స్థానిక గోల్కోండ గార్డెన్స్ లో పాలపళ్ల సైజు నుంచి సీనియర్ విభాగం వరకు ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంక్రాంతి పండుగ అనంతరం రైతులు అమితంగా ఇష్టపడే ఎడ్ల పోటీల పండుగ ప్రారంభంతో వారికి ఎనలేని ఆనందం, ఉత్సాహం లభిస్తాయని ప్రత్తిపాటి చెప్పారు. ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో విశేష అనుభవమున్న సాంబశివరావు పర్యవేక్షణలో పోటీలు ఘనంగా నిర్వహించ నున్నట్టు తెలిపారు. పశువులు, ముఖ్యంగా ఒంగోలు జాతి ఎడ్ల పోషణపై రైతులకు ఆసక్తి పెంచేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు.కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, జిడిసిసి మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, పోటీల నిర్వాహకులు సాంబశివరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, జిల్లా ఉపాధ్యక్షులు బత్తినేని శ్రీనివాసరావు , టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, ముద్దన నాగేశ్వరరావు, పోపూరి వెంకయ్య, కంచర్ల శ్రీనివాసరావు, గుర్రం నాగపూర్ణ చంద్రరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కోటప్పకొండ తిరునాళ్లను విజయవంతం చేద్దాం




**పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎస్పీ కృష్ణారావు**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి జనవరి 7: పల్నాడు జిల్లా నరసరావుపేటలో మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో నిర్వహించనున్న తిరునాళ్లను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, జిల్లా ఎస్పీ కృష్ణారావు పిలుపునిచ్చారు. నరసరావుపేటలో కోటప్పకొండ తిరునాళ్ల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ, తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభల తరలింపుకు ఆటంకం లేకుండా రహదారులను సక్రమంగా తీర్చిదిద్దాలని, ప్రభల రాకపోకల సమయంలో విద్యుత్ వైర్లు తగలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాను పకడ్బందీగా చేపట్టాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా సిబ్బందిని నియమించాలని తెలిపారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు మంచినీటి ప్యాకెట్లు అందించాలని ఆదేశించారు.కొండ కింద నుంచి కొండపై వరకు భక్తుల రాకపోకలకు అనువుగా ఘాట్ రోడ్డులో అవసరమైన బస్సులను ఏర్పాటు చేయాలని, 108 అంబులెన్సులు, మెట్ల మార్గం, క్యూలైన్లు, కొండపై వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపడంతో పాటు అదనపు డ్రైవర్లు, మెకానికులు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ, తిరునాళ్లను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దనుర్మాసం సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి జనవరి 7: దనుర్మాసం పర్వదినాలను పురస్కరించుకుని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు బుధవారం తెల్లవారుజామున తిరుమలలో కొలువైన శ్రీ వేంకటేశ్వర స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఉదయం స్వామివారి సుప్రభాత సేవ అనంతరం ఆలయంలో ప్రవేశించిన ఎమ్మెల్యే ప్రత్యేక దర్శనం ద్వారా స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు ఆరోగ్యం, సుఖశాంతులు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దనుర్మాసం హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన కాలమని, ఈ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం విశేష ఫలితాలను ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. తిరుమల ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం మనసుకు ప్రశాంతతను కలిగిస్తుందని అయన అన్నారు. దర్శనం అనంతరం టీటీడీ అధికారులతో ఎమ్మెల్యే కొద్దిసేపు సమావేశమై, ఆలయ నిర్వహణ, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై చర్చించారు.

# కర్నాటక లో బీజేపీ మహిళా కార్యకర్తపై పోలీసులు దురుసు

**కస్టడీలోకి తీసుకున్న సమయంలో ఆమెపై దాడి చేసి దుస్తులు చింపేశారు**

బెంగుళూరు ;: కర్నాటక లో బీజేపీ మహిళా కార్యకర్తపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. కస్టడీలోకి తీసుకున్న సమయంలో ఆమెపై దాడి చేసి దుస్తులు చింపేశారు. ఈ ఘటన హుబ్లీలో జరిగింది. కాంగ్రెస్ కార్పొరేటర్ సువర్ణ కల్లకుంట్ల ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆ మహిళను కస్టడీలోకి తీసుకున్నారు. కేశ్వాపూర్ రాణాలో చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ సమయంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ధర్నా చేపట్టిన బీజేపీని అడ్డుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు.ఆ టైంలో ఓ బీజేపీ కార్యకర్త దాన్ని అడ్డుకున్నది. అభ్యంతరం వ్యక్తం చేసింది. తిరగబడ్డ ఆ కార్యకర్తపై దాడి చేశారు. ఆ పెనుగులాటలో ఆమె దుస్తులు చినిగిపోయాయి. ఆ మహిళా కార్యకర్త గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసింది. ఇటీవల ఆమె బీజేపీలో చేరింది. ఓటర్ల జాబితా నుంచి కొందరి పేర్లను తొలగించే అంశంలో అధికారులకు ఆ మహిళ సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.తమ ప్రవర్తనపై పోలీసులు ప్రకటన చేయాల్సి ఉన్నది. ఈ ఘటన తర్వాత అక్కడ రాజకీయ ఉద్రిక్తత నెలకొన్నది. రెండు పార్టీలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నాయి.

# అది జరగాలంటే చైనా,రష్యాతో సంబంధాలు తెంచుకోవాలి.

వెనెజువెలాకు ట్రంప్ టీమ్ షరతులున్యూ ఢిల్లీ: ;అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండో దఫా పాలనలో విదేశాంగ విధానం ద్వారా తన ఆకాంక్షలను తీర్చుకునే పనిలో పడ్డారు. రాత్రికి రాత్రి వెనెజువెలా పై కమాండో దాడి జరిపి ఆ దేశ అధ్యక్షుడిని, ఆయన భార్యను బందీలుగా అమెరికాకు తరలించి ట్రంప్ తన పంతం నెరవేర్చుకున్నారు. అంతటితో ఆగని ట్రంప్.. దక్షిణ అమెరికా దేశాన్ని మొత్తం తానే నియంత్రిస్తున్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రభుత్వానికి ట్రంప్ కీలక హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది.వెనెజువెలా కొత్త నాయకత్వం చైనా, రష్యా, ఇరాన్, క్యూబాలతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. అంతేకాదు, చమురు ఉత్పత్తిలో అమెరికాతో మాత్రమే భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా హెవీ క్రూడ్ ఆయిల్ విక్రయాల్లో అమెరికాకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది.వెనెజువెలా చమురు ఉత్పత్తిని పెంచుకోవాలంటే తాను పెట్టిన ఈ షరతులు పాటించాలని ట్రంప్ టీమ్ స్పష్టం చేసినట్లు ఏబీసీ న్యూస్ నివేదిక వెల్లడించింది. 'మొదట ఆ దేశం (వెనెజువెలా) చైనా, రష్యా, ఇరాన్, క్యూబాతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలి. రెండోది.. వెనెజువెలా చమురు ఉత్పత్తిలో అమెరికాతో ప్రత్యేక భాగస్వామిగా ఉండేందుకు, భారీ ముడి చమురు విక్రయాల్లో అమెరికాకు అనుకూలంగా ఉండేందుకు అంగీకరించాలి' అని ట్రంప్ టీమ్ షరతులు పెట్టినట్లు సదరు నివేదిక పేర్కొంది.

# చైనాలో మంచు సునామీ...

జిన్‌జియాంగ్ ప్రాంతంలో గడ్డ కట్టిన ఓ నదిబీజింగ్ : శీతాకాలం కావడంతో ప్రపంచ వ్యాప్తంగా విపరీతంగా మంచు కురుస్తోంది. ఈ మంచు కారణంగా కొన్ని చోట్ల అవలాంఛ్‌లు ఏర్పడుతుండగా.. మరికొన్ని చోట్ల మంచు సునామీలు సంభవిస్తున్నాయి. తాజాగా చైనా లో మంచు సునామీ వచ్చింది. జిన్‌జియాంగ్ ప్రాంతంలో గడ్డ కట్టిన ఓ నదిలో 'మంచు సునామీ' అలలు ఏర్పడ్డాయి. చెట్లపై ఉన్న మంచు సైతం ఒక్కసారిగా కిందకు పడింది. మంచు సునామీని చూసిన స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన భయంకర వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి:

**-ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి ; : పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిలాంటిదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి వెల్లడించారు. బుధవారం ఆయన ఏలూరు జిల్లా పోలవరంలో మంత్రులతో కలసి పోలవరం ప్రాజెక్టు ను సందర్శించారు. కాఫర్ డ్యామ్, బట్రస్ డ్యామ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన పోలవరంలో మీడియా సమావేశంలో మాట్లాడారు.వైసీపీ రాష్ట్రంలోని రాయలసీమ నీటి ప్రాజెక్టులపై చిల్లర రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. రాయలసీమకు ఎత్తిపోతల ద్వారా నీటి వాడకాన్ని నిలిపివేసినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తుందని దుయ్యబట్టారు. తనపై బురద చల్లడం వల్ల ఆరోపణలు నిజం కాబోవని స్పష్టం చేశారు. కన్‌స్ట్రక్టీవ్ రాజకీయాలు చేయాలని సూచించారు.పోలవరం గ్యాప్ -1లో పనులన్నీ ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్యాప్-2లో అప్‌స్ట్రీమ్ , డౌన్ స్ట్రీమ్ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. రైట్ కనెక్టివిటీలో 19 మీటర్లు వెడల్పు, ఎత్తుతో రెండు టన్నెళ్లు వస్తాయని పేర్కొన్నారు. విశాఖకు నీరు తీసుకెళ్లే కాలువను బాగా వెడల్పు చేశామని, దీంతో అనకాపల్లి, విశాఖ జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని వెల్లడించారు.పట్టిసీమ ఎత్తిపోతలను ఏడాది వ్యవధిలో పూర్తి చేశామని వివరించారు. ఈ సంవత్సరం 97 శాతం అన్ని జల నీటివనరుల్లోకి నీరు వచ్చి చేరిందని , ప్రస్తుతం అన్ని జలాశయాల్లో 780 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇది ఎంతో గర్వకారణమని అన్నారు. శ్రీశైలంలో నీళ్లు పొదుపు చేసి రాయలసీమకు నీరివ్వగలిగామని వెల్లడించారు. రాయలసీమలో గొల్లపల్లి కట్టి కియా మోటార్స్ తీసుకొచ్చానని వివరించారు.

# టెట్ మినహాయింపు కోరుతూ ఫిబ్రవరి 5న ఢిల్లీలో మార్చ్ టు పార్లమెంట్

## -9న నల్లబ్యాడ్జీలతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు,

## -రాష్ట్రపతికి విజ్ఞాపన పత్రాల సమర్పణఐక్య ఉద్యమంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిసి రావాలి

## -ఎఐ జాక్టో రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు

హైదరాబాద్ (జనవరి 07). పెన్ పవర్ ప్రతినిధి ..సీనియర్ ఉపాధ్యాయులను ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుండి మినహాయించాలని, ప్రభుత్వ విద్యకు నష్టం కలిగించే జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి) ని రద్దు చేయాలని, పాఠశాలల మూసివేత, విలీనాలను ఆపాలని, ఎన్పిఎస్, సిపిఎస్ లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రాథమిక ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని తదితర డిమాండ్లతో అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (ఎఐ జాక్టో) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న ఢిల్లీలో నిర్వహిస్తున్న పార్లమెంటు మార్చ్ ను విజయవంతం చేయాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్ లో ఎఐ జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యుడు, ఎస్టియు రాష్ట్ర అధ్యక్షుడు జి సదానందం గౌడ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చి నాలుగు నెలలు గడిచినా కేంద్ర ప్రభుత్వం గానీ, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్సీటిఈ) గానీ ఏమాత్రం స్పందించకుండా మౌనంగా ఉండడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. 23 ఆగస్టు 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష మినహాయింపు ఇచ్చినట్లు నోటిఫికేషన్ లో పేర్కొన్న ఎన్సీటిఈ సుప్రీంకోర్టుకు ఆ విషయాన్ని తెలియజేయడంలో విఫలమైందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెండేళ్లలో టెట్ పాస్ కాకపోతే లక్షలాది ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, వేలాది పాఠశాలలు మూతపడి, పేద పిల్లలకు విద్య దూరమయ్యే ప్రమాదం దాపురించిందని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యా వ్యవస్థలో సంక్షోభానికి కారణమైన సుప్రీంకోర్టు తీర్పుకు కేంద్ర ప్రభుత్వం, ఎన్సీటిఈ లే బాధ్యత వహించాలని అన్నారు. తక్షణమే కేంద్రం సుప్రీం కోర్టులో రివ్యూ లేదా క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేయాలని, లేదా సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించే విధంగా విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలపాలని, అన్ని జిల్లాల నుండి రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి మెమోరాండంలు పోస్టు చేయాలని, ఫిబ్రవరి 5న ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఢిల్లీ వెళ్ళి పార్లమెంట్ మార్చ్ నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో ఐక్యంగా పోరాడాలని అఖిలభారత ఉపాధ్యాయ సంఘాలు స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టిఎఫ్ఐ), ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఎఐఎస్టిఎఫ్), ఆల్ ఇండియా ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్ (ఎఐపిటిఎఫ్), ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐఎఫ్ఇటిఒ) లు నిర్ణయించాయి. ఆమేరకు అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్) (ఎఐజాక్టో) ఏర్పాటైందని, ఇతర జాతీయ ఉపాధ్యాయ ఫెడరేషన్లు ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ఎడ్యుకేషనల్ అసోసియేషన్స్(ఐఫియా), ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఎఐఎస్ఈసి), ఆల్ ఇండియా ఫోరం ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్ (ఎఐఎఫ్ఆర్టిఈ), జాయింట్ ఫోరం ఫర్ మూవ్ మెంట్ ఆన్ ఎడ్యుకేషన్ (జెఎఫ్ఎంఈ), ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎఐఎస్జిఈఎఫ్) ఈ పోరాటానికి మద్దతు ఇస్తున్నాయని ఎఐ జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యుడు, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి తెలిపారు. టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్, ఎస్టియు ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, పిటిఎ టిజి అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె శారద, ఎఐఎఫ్ఇటిఒ జాతీయ కార్యదర్శి పోల్ రెడ్డి, టిఆర్ టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ తిరుపతి, టిఎస్టియు అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్లా, డిటిఎఫ్ నాయకులు రామకృష్ణ, సుటా అధ్యక్షుడు ఎంఎ నయీమ్ , ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఖాన్, ఎంటియు అధ్యక్షుడు మోయిన్, ప్రధాన కార్యదర్శి ఎం ఎ అలీమ్, టిడబ్ల్యు టియు ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, టిజిటిఎ ప్రధాన కార్యదర్శి గీతాంజలి, ఎం ఎస్ టి యు అధ్యక్షులు విఠల్, సయ్యద్ అజ్గర్, మీర్ ముంతాజ్ అలీ, పర్వతి సత్యనారాయణ, ఎస్ వై కొండలరావు, కరుణాకర్ రెడ్డి, ఇఫ్తేకారుద్దీన్, రామసుబ్బారావు, నరసింహారెడ్డి, మస్తాన్ రావు, ఎం దేవదాసు, జి వెంకటేశ్వర్లు, సిహెచ్ ప్రభాకర్, సందీప్, వరలక్ష్మి తదితర నాయకులు పాల్గొన్నారు.



## శ్రీ గోదా దేవి అమ్మవారికి సారె సమర్పణ

కందుకూరు, పెన్ పవర్ ప్రతినిధి కందుకూరు పట్టణంలో పెద్ద బజారు నందు ఉన్న శ్రీ వేణుగోపాలకృష్ణ ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం ఆలయ ప్రెసిడెంట్ గొల్ల వెంకన్న ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు, భక్తులందరూ కలిసి శ్రీ గోదా దేవి అమ్మవారికి వైభవంగా సారె ను సమర్పించారు. ఉదయం అన్నా కాంటీన్ వద్ద ఉన్న అశ్వద్ధ నారాయణ వృక్షం వద్ద ఆలయ అర్చకులు పవన్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ఊరేగింపుగా బ్యాంకు బజార్ మీదుగా శ్రీ వేణుగోపాలకృష్ణ ఆలయం నకు మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నూతన దుస్తుల పంపిణి



కావలి, పెన్ పవర్ ప్రతినిధి నూతన సంవత్సరం మరియు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కావలి మండలం తాళ్లపాలెం గిరిజన కాలనీ నందు 35 కుటుంబాలకుచీర,పంచ,టవల్ దుప్పటితో కూడిన నూతన దుస్తుల కిట్ మరియు చిన్న పిల్లలకు ఒక జత రెడీమేడ్ దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ కె. హరినారపరెడ్డి, పాలక మండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్, జనగర్ల మనోహర్,గొట్టిపాటి మనోరమ,రెడ్ క్రాస్ వాలంటీర్స్ లోకేష్ ,రఘువరన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## ఢిల్లీలో అర్ధరాత్రి ఉద్రిక్తత..

న్యూఢిల్లీ: పెన్ పవర్ ప్రతినిధి ఢిల్లీలోని రాంలీలా మైదాన్ ప్రాంతంలోని సయ్యద్ ఫైజ్-ఎ-ఇలాహి మసీదు సమీపంలో చేపట్టిన బుల్డోజర్ చర్య ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. అర్ధరాత్రి కూల్చివేతలకు పాల్పడటమే కాకుండా అడ్డుకున్న స్థానికులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని సీనియర్ పోలీస్ అధికారి బుధవారం ప్రకటించారు. బిఎన్ఎస్ సెక్షన్లు 221 (ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకోవడం),132 (ప్రభుత్వ ఉద్యోగిపై దాడి), 121(ప్రభుత్వ ఉద్యోగిని నిరోధించడానికి స్వచ్ఛందంగా గాయపరచడం), 191 (అల్లర్లు),223(ఎ), 3(5), ప్రభుత్వ ఆస్తికి నష్టం వాటిల్లకుండా నిరోధించే చట్టం, 1984 నిబంధనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. హింసకు ముందుగానే కుట్ర పన్నారా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. రాళ్లు, గాజు సీసాలు విసరడంతో ఐదుగురు పోలీసులకు గాయాలయ్యాయని అన్నారు. రాళ్లదాడికి పాల్పడిన వారిని గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం.. బుధవారం ఉదయం 8.00 గంటలకు చేపట్టాల్సిన కూల్చివేత ప్రక్రియను అధికారులు అర్ధరాత్రి 1.30గంటలకే ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ చర్యపై ఆగ్రహించిన స్థానికులు కూల్చివేతను అడ్డుకునేందుకు యత్నించారు. వారిని చెదరగొట్టేందుకు భద్రతా బలగాలు టియర్గ్యాస్ ప్రయోగించారు.

## అగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

చెన్నై: పెన్ పవర్ ప్రతినిధి శ్రీలంక సమీపంలోని ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడిందని, ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ బుధవారం నాటికి నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. అనంతరం 48 గంటల్లో తమిళనాడు తీరం వైపు కదిలే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఆ తర్వాత ఇది తీవ్ర వాయుగుండంగా బలపడుతుందని తెలిపింది.అయితే దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఉండబోదని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు. తమిళనాడులో మాత్రం విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. శనివారం దక్షిణ కోస్తా, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, మిగిలిన ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత కొంత తగ్గే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



## తమిళనాడులో అంగన్‌వాడీ కార్యకర్తల నిరసనలు

తిరుచ్చి: పెన్ పవర్ ప్రతినిధి

తమను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని, చిన్నారుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని, ఇంకా పలు డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ తమిళనాడు వ్యాప్తంగా పలు జిల్లాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, అసిస్టెంట్‌లు మంగళవారం రహదారుల దిగ్బంధన నిర్వహించారు. తిరుచ్చి, పుదుకొట్టారు, తంజావూరు, అరియలూర్ జిల్లాల్లో నిరసనల సందర్భంగా అనేకమందిని అరెస్టు చేశారు. సీఐటీయూ అనుబంధ తమిళనాడు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ అసిస్టెంట్స్ అసోసియేషన్‌కి చెందినవారే వీరంతా. కుటుంబ పెన్షన్‌గా రూ.9వేలు ఇవ్వాలని, రిటైరైతే రూ.10లక్షల గ్రాట్యూటీ ఇవ్వాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు. తిరుచ్చిలో జిల్లా కలెక్టరేట్ సమీపంలో దాదాపు వెయ్యిమంది అంగన్‌వాడీ వర్కర్లు, అసిస్టెంట్లు దాదాపుగా గంట పాటు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రోడ్డు రోకోకు దిగడంతో వెంటనే వారిని అదుపులోకి తీసుకుని తర్వాత విడుదల చేశామని పోలీసులు తెలిపారు. పుదుకొట్టారు పట్టణంలో కూడా దాదాపు 1200మంది నిరసనలకు దిగారు. రహదారులను దిగ్బంధించారు. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేసి, కాసేపటి తర్వాత వదిలిపెట్టారు. అరియలూర్ పట్టణంలో 500మందికి పైగా అరెస్టయ్యారు. అన్నా విగ్రహం సమీపంలో వారు పికెటింగ్ చేశారు. తంజావూరులో 385మందిని అరెస్టు చేసి వదిలిపెట్టారు.

## జనవరి 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు!

న్యూఢిల్లీ పెన్ పవర్ ప్రతినిధి

: వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జనవరి 31నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. తొలిరోజు పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 1న 2026-27 వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. అయితే ఈ సారి ఫిబ్రవరి 1 ఆదివారం రావడంతో బడ్జెట్‌ను ప్రవేశపెడతారా లేదా అనే సందేహాలు తలెత్తుతున్న క్రమంలో ఇప్పుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. మరోపక్క ప్రభుత్వం ప్రవేశపెట్టే ఈ బడ్జెట్‌పై మధ్య తరగతి ప్రజలు, రైతులు, యువత? కోటి ఆశలు పెట్టుకున్నారు. ఏటా ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. 2017 నుంచి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. అయితే, ఈ సారి ఫిబ్రవరి 1న ఆదివారం రావడం, ఆ రోజు సెలవుదినం కావడంతో బడ్జెట్ ప్రవేశ పెడతారా..? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టొచ్చన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ అంశం ఆసక్తికరంగా మారింది. అయితే, దీనిపై కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. అయితే, వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తేమీ కాదు. 2016లో తొలిసారి అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తరువాత 2025లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఆదివారాల్లో పార్లమెంట్ సమావేశమైన సందర్భాలూ ఉన్నాయి. కరోనా సమయంలో (2020), అలాగే పార్లమెంట్ తొలి సమావేశం 60వ వార్షికోత్సవం సందర్భంగా 2012, మే13న ఆదివారం సభ జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం కూడా బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు.

## అర్హులైన ఓటర్లను చనిపోయినట్లుగా చూపిస్తోందని మమతా బెనర్జీ మండిపాటు

కోల్‌కతా: పెన్ పవర్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం బీజేపీ ఐటీ విభాగం అభివృద్ధి చేసిన యాప్‌ను ఎన్నికల సంఘం వినియోగిస్తోందని ఆమె ఆరోపించారు. ఇది చట్టవిరుద్ధమని అప్రజాస్వామికమని, రాజ్యాంగ విరుద్ధమని ఆమె వ్యాఖ్యానించారు. అన్నారు. గంగాసాగర్ మేళా ఏర్పాట్లను సమీక్షించేందుకు దక్షిణ 24 పరగణాల జిల్లాలోని సాగర్ ఐలాండ్‌లో రెండు రోజుల పర్యటన ముగిసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.ఎన్నికల సంఘం రాజ్యాంగ విరుద్ధమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక, తప్పుడు పద్ధతులను అనుసరిస్తోందని ఆమె ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఈసీ అన్ని విధాలా తప్పులతడకగా నిర్వహిస్తోందని మండిపడ్డారు. వృద్ధులు, అనారోగ్యంతో బలహీనంగా ఉన్నవారిని విచారణకు రావాలని బలవంతం చేస్తూ వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన ఓటర్లను మరణించినట్లుగా చూపిస్తోందని ఆరోపించారు.మమతా బెనర్జీ చేసిన ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఆమె ఆరోపణలు నిరాధారమని, రాజకీయ ప్రేరేపితమైనవని పేర్కొంది.

# గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం..

## - టిడిపి నాయకులు శివప్రసాద్...- వేజెండ్ల వారి లంక గ్రామంలో 25 లక్షలతో సిసి రోడ్డు ప్రారంభం

రేపల్లె పెన్ పవర్ .రేపల్లె రూరల్ మండలం మోర్లవారిపాలెం పంచాయతీ వేజండ్లవారిలంక గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన గ్రాంట్ ద్వారా 25 లక్షలతో నిర్మించిన సిసి.రోడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు..గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు గత వైసిపి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి రోడ్లు మరమ్మతులకు ఎలాంటి నిధులు కేటాయించకుండా పూర్తిగా గ్రామాలను విస్మరించిందని ఆయన ఆరోపించారు ప్రస్తుత ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు నిధులు కేటాయించి గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నదని శివప్రసాద్ అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీ



తిరుపతమ్మ సోమశేఖర్.. టిడిపి నాయకులు ఎం అంజయ్య కె రామకృష్ణ టి ఏడుకొండలు జి మురహరరావు వి కృష్ణ మోహన్.. వి సోమశేఖర్.. షేక్ జమీర్ డి బుజ్జి ఈ ఓ ఆర్ పి డి ప్రసాద్ బాబు.. ఇంజనీరింగ్ శాఖ అధికారులు గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులు గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు

# 36 లక్షలు రూపాయలతో వేజెండ్ల వారి లంక గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఆరోగ్య సంరక్షణ భవన నిర్మాణానికి శంకుస్థాపన..

..రేపల్లె పెన్ పవర్ .రేపల్లె రూరల్ మండలం మోర్లవారిపాలెం పంచాయతీ వేజండ్లవారిలంక గ్రామంలో 36 లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆరోగ్య సంరక్షణ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ పాల్గొని భూమి పూజ నిర్వహించారు.. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని ఇందులో భాగంగా గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఆరోగ్య సంరక్షణ భవనాలను నిర్మిస్తున్నదని శివ ప్రసాద్ అన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీ తిరుపతమ్మ సోమశేఖర్.. మాజీ సర్పంచ్ ఎం అంజయ్య టిడిపి నాయకులు కృష్ణ మోహన్ సోమశేఖర్ బసవేశ్వర రావు తాత. ఏడుకొండలు కే రామకృష్ణ. జి మురహరి రావు జమీర్ డి శ్రీనివాసరావు మండల పరిషత్ గ్రామ విస్తరణ అధికారి ప్రసాద్ బాబు గ్రామ వార్డు ఇంజనీరింగ్ సచివాలయ ఉద్యోగులు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# విద్యార్థులు చదువుతోపాటు అమలులో ఉన్న చట్టాలు గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలి....

## - రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు.




. రేపల్లె... పెన్ పవర్ విద్యార్థులు చదువుతోపాటు ప్రస్తుతం మారిన అమలులో ఉన్న పలు రకాల చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని రేపల్లె డిఎస్పి ఏ శ్రీనివాసరావు అన్నారు.. రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై నిర్మూలన. అంతర్జాతీయ యువత దినోత్సవం పై ఉచిత న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు స్థానిక ఉయ్యూరు వారి పాలెం రోడ్డు లోని విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ నందు జరిగింది.. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ ఎండి.సాజిద్ పాషా అధ్యక్షత వహించారు.. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ మహిళలు పిల్లలు భద్రత కోసం మహిళల సహాయ డెస్క్ లను.. శక్తి యాప్ లను ప్రతి విద్యార్థిని డౌన్లోడ్ చేసుకుని ఇన్స్టాల్ చేసుకోవాలని అన్నారు చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాలు చట్టం ఫోక్స్ చట్టం గురించి అవగాహన కల్పించారు.. బాలికలు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలని ఆ విధంగా కాకుండా మైనర్లు గా వివాహం చేసుకుంటే చట్టరీత్యా నేరం కేసులు నమోదు కోర్టులు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని అవగాహన కల్పించారు.. శక్తి టీం బృందం రేపల్లె డివిజన్ కోఆర్డినేటర్ నగరం ఎస్సై భార్గవ్ మాట్లాడుతూ ప్రస్తుతం పోలీస్ శాఖ అమలు చేస్తున్న పలుచట్టాల గురించి వాటి వలన కలిగే ప్రయోజనాలు నష్టాలు గురించి వివరించారు సైబర్ నేరాలు సోషల్ మీడియా లింకులు.. క్లిక్కులు ఓపెన్ చేయరాదని వీటి వలన నష్టాలు ఎక్కువ అని ప్రచార బోర్డుల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటి యువత వివేకానందుని స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని.. బాల్య వివాహాలు నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ రేపల్లె మండల పారా లీగల్ వాలంటీర్లు చెన్ను నాగమల్లేశ్వరరావు . రాచ బత్తుల శ్రీనివాసరావు . సయ్యద్ తాహిర్ అహ్మద్.. ఆలా మోషే లు అవగాహన కల్పిస్తూ మాట్లాడారు.... అనంతరం బాల్య వివాహాలు వద్దు.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. సైబర్ నేరాలను అరికడదాం మహిళల సహాయ శక్తి యాప్ లను సద్వినియోగం చేసుకుందాం.. ఉచిత న్యాయ విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకుందాం.. త్రిబుల్ రైడింగ్ బెట్టింగ్ వంటి వాటిని అరికడదాం .. రోడ్డు భద్రత నియమాలను పాటిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు.. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై ఎస్ రాజశేఖర్ మహిళ కానిస్టేబుళ్లు.. ఒకేషనల్ కాలేజ్ డైరెక్టర్ రిజ్వానా.. కాలేజీ అధ్యాపకులు శశి కుమార్ రవిబాబు అనిల్ కుమార్.. తదితరులు పాల్గొన్నారు..

# పినపాడు పట్టణ ఆరోగ్య కేంద్రంనందు ఆశా కార్యక్రమం:




తెనాలి. పెన్ పవర్ రేపల్లె ప్రతినిధి..07..01.26.తెనాలి పినపాడు ఆరోగ్య కేంద్రం నందు ఆశాడే కార్యక్రమాన్ని.. వైద్యాధికారి డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు మాట్లాడుతూ ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో గర్భిణీ స్త్రీల నమోదును సత్వరమే రిజిస్టర్ చేసి వారికి మేలైన ఆరోగ్య సేవలు అందించాలన్నారు. గర్భిణీ స్త్రీలతో పాటు చిన్నారులకు కూడా వ్యాధి నిరోధక టీకాలను నిర్దేశించిన సమయాలలో తప్పక అందించాలన్నారు. పట్టణ ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది నీటి నిల్వలను పరిశీలించి సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. దోమల లార్వాలను నివారించుటలో ప్రజల యొక్క సహకారము ఎంతైనా అవసరమని పట్టణ ప్రజలందరికీ తెలియజేయాలని అన్నారు. పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీ కంత ఉమాకాంత్ మాట్లాడుతూ చెక్ , క్లీన్ , కవర్ , అనే మూడు విధానాలను అవలంబించాలని,నీటిని నిల్వల్లో మడ్డి ఆయిల్ కానీ , తీసివేసిన వంటనూనెను కానీ వేసినచో లార్వాలు నిర్వీర్యమైపోతాయన్నారు. దోమల వలన మలేరియా, ఫైలేరియా ,డెంగ్యూ, చికెన్ గునియా , మెదడువాపు వ్యాధులు వస్తాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విద్యా బోధన చేయాలన్నారు. మలేరియా సూపర్వైజర్ దీపాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహిస్తూ వెక్టార్ హైజిన్ యాప్ ను ఆరోగ్య కార్యదర్శులు పరిశీలించి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ సంధ్యారాణి , స్టాఫ్ నర్స్, డిఇఓ గోపాలకృష్ణ , ల్యాబ్ టెక్నీషియన్ సుధీర్ , ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# కావలి అభివృద్ధిపై సీఎం చంద్రబాబుని కలిసిన కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి..



కావలి, పెన్ పవర్ : జనవరి-07;కావలి నియోజకవర్గంలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఈరోజు అమరావతి సెక్రటేరియట్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కావలి శాసనసభ్యులు కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కావలి పట్టణం మరియు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.ప్రధానంగా కావలి పట్టణంలో కలుగోలమ్మ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని తొలగించి,ప్రజలకు అనుకూలంగా అండర్ పాస్ నిర్మించాలని ఎమ్మెల్యే సీఎం చంద్రబాబును కోరారు. ఫ్లైఓవర్ వల్ల కలిగే సమస్యలను వివరించి, అండర్ పాస్ నిర్మాణమే పట్టణ అభివృద్ధికి మరియు ప్రజల భద్రతకు అనుకూలమని స్పష్టం చేశారు.అలాగే కావలి పట్టణంలో పురాతన చరిత్ర కలిగిన కలుగోల శాంభవి అమ్మవారి దేవస్థానం పూర్వ వైభవం దక్కేలా అభివృద్ధి చేయాలని, సీఎంకి విజ్ఞప్తి చేశారు.కావలి నియోజకవర్గంలో ఇరిగేషన్‌కు సంబంధించిన పలు పనులు,రోడ్లు,రైతుల అవసరాలు గురించి సీఎం గారితో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పనితీరును ప్రశంసిస్తూ,"కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మీరు బాగాపని చేస్తున్నారు" అంటూ అభినందనలు తెలిపారు. కావలి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం హామీ ఇచ్చారు.. సీఎంకి కావలి నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేసిన ఎమ్మెల్యే కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి..

# పరకొండపాడు గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసిన అల్లం సుమతి



గుడ్లూరు, పెన్ పవర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను పరకొండపాడు గ్రామ సచివాలయంలో బుధవారం పరకొండపాడు విఆర్వో తో కలిసి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన కందుకూరు నియోజకవర్గం తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి అల్లం సుమతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ జనవరి 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సచివాలయాలలో రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ జరుగుతున్న తీరును చూసి రైతుల కళ్ళల్లో ఆనందం కనబడుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతులకు ఇవ్వవలసిన పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ వేసుకోవడం దుర్మార్గమని దానికి తగిన ప్రతిఫలం అనుభవిస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ తో పాటు దప్పలంపాడు టిడిపి నాయకులు పైడి ప్రసాద్, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు అధికసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# నిజాంపట్నం మండలగ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కార్యవర్గం..

రేపల్లె. పెన్ పవర్ 7.1.26.బాపట్ల జిల్లా రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని నిజాంపట్నం మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ కార్యవర్గ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా కె. జ్యోతి, ఉపాధ్యక్షులుగా జి. సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కె. జ్యోతి, సహాయ కార్యదర్శిగా ఎన్. వెంకటేశ్వరావు, ట్రెజరర్‌గా బి. వరప్రసాద్ ఎన్నికయ్యారు.గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు తెలిపారు.నూతన కార్యవర్గానికి తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.



# కంచర్ల ఫౌండేషన్,, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలోపదవ తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

గుడ్లూరు, పెన్ పవర్ :కంచర్ల ఫౌండేషన్ మరియు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ, కందుకూరు వారు కందుకూరు నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని1600 మంది10 వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందచేశారు.అందులో భాగంగా గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10 వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందచేశారు.ఈ సందర్బంగా విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తూ ధన్యవాదములు తెలియ చేశారు



# ఉదయాన్నే తిన్నారనుకోండి..!



శీతాకాలంలో ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది ఫైబర్, ఐరన్ లాంటి ముఖ్య పోషకాలతో నిండి ఉంటుంది. కీళ్ల నొప్పులు, అలసట, జలుబు లాంటి సమస్యల నుంచి ఉపశమనం అందిస్తుంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. శీతాకాలంలో ఎండు ఖర్జూరం తినొచ్చా.? లేదా.? ఇది అందరిలోనూ ఉండే ప్రశ్న. ఈ వింటర్ సీజన్‌లో ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. ఎండు ఖర్జూరం ఎముకలను బలంగా మార్చడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరిచడంలో సహాయపడుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా చలికాలంలో కొన్ని ప్రత్యేకమైన డ్రై ఫ్రూట్స్ తీసుకుంటే శరీరానికి మరింత శక్తి, రోగనిరోధక శక్తి లభిస్తాయి. అలాంటి వాటిలో ఎండు ఖర్జూరం ఒకటి. ఎండు ఖర్జూరంలో ఫైబర్, పొటాషియం, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ బి లాంటి కీలక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక రకాల వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా చలికాలంలో వచ్చే ఎముకల నొప్పులు, జీర్ణ సమస్యలు, అలసట లాంటి సమస్యలకు ఎండు ఖర్జూరం మంచి ఔషధంలా పనిచేస్తుంది. చలికాలంలో చాలామందికి నడుము నొప్పి, కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఇలాంటి సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు ఎండు ఖర్జూరం చాలా ఉపయోగపడుతుంది. రాత్రి ఒక గ్లాసు నీటిలో రెండు ఎండు ఖర్జూరాలు, ఒక చెంచా మెంతులు నానబెట్టి ఉంచి.. ఉదయం లేచిన వెంటనే ఖర్జూరాలను నమిలి తిని, ఆ నీటిని వడగట్టి తాగాలి. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే శరీరంలోని నొప్పులన్నీ క్రమంగా తగ్గుతాయి. ఎప్పుడూ అలసటగా ఉండటం, శరీరంలో శక్తి లేకపోవడం లాంటి సమస్యలు ఉంటే ఎండు ఖర్జూరం మంచి పరిష్కారం. రాత్రి పూట లేదా ఉదయం ఎండు ఖర్జూరం తినడం వల్ల శరీరానికి ఎనర్జీ వస్తుంది. అలాగే ఐరన్ అధికంగా ఉండటం వల్ల రక్తహీనత సమస్య ఉన్నవారికి ఇది ఎంతగానో ఉపయోగకరం. ఇది శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడి, రక్తహీనత లక్షణాలైన అలసటను తగ్గిస్తుంది. చలికాలంలో ఛాతిలో కఫం చేరడం, దగ్గు, జలుబు లాంటి శ్వాస సంబంధిత సమస్యలు సర్వసాధారణం. రెండు ఎండు ఖర్జూరాలను బాగా నమిలి తిని, తర్వాత కొద్దిగా గోరువెచ్చని నీరు తాగితే కఫం కరిగి బయటకు రావడంలో సహాయపడుతుంది. తద్వారా శ్వాస సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ఎండు ఖర్జూరంలో ఫైబర్, మెగ్నీషియం అధికంగా ఉండటం వల్ల జీర్ణ వ్యవస్థ బలపడుతుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీ లాంటి సమస్యల నుంచి ఉపశమనం అందిస్తుంది. క్రమం తప్పకుండా ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల పేగులు ఆరోగ్యంగా పనిచేస్తాయి. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కూడా ఎండు ఖర్జూరం కీలకపాత్ర పోషిస్తుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె పనితీరును బలోపేతం చేస్తుంది. అలాగే, రోగనిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో సమృద్ధిగా ఉంటాయి. వీటి వల్ల జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధుల నుంచి శరీరం రక్షణ పొందుతుంది. చలికాలంలో ఎండు ఖర్జూరం తీసుకోవడం శరీరానికి చాలా మంచిది. రోజు పరిమిత మోతాదులో తీసుకుంటే శక్తి, ఆరోగ్యం రెండు మెరుగవుతాయి. అయితే, మధుమేహం ఉన్నవారు మాత్రం వైద్యుల సలహాతో మాత్రమే తీసుకోవడం మంచిది.



# ఏ టిఫిన్ బాక్స్ ఆరోగ్యానికి మంచిది..?

మీ ఆరోగ్యాన్ని కాపాడటానికి సరైన టిఫిన్ బాక్స్‌ను ఎంచుకోవడం ముఖ్యం. ప్లాస్టిక్ బాక్స్‌లు హానికరమైన రసాయనాలను విడుదల చేసి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తాయి. కాబట్టి మంచి టిఫిన్ బాక్సులు ఎంచుకోవడం బెటర్. సాధారణంగా మనం ఆరోగ్యంగా ఉండాలని పోషకాలున్న ఆహారాన్ని వండుకుంటాం. కానీ ఆ ఆహారాన్ని దేనిలో తీసుకెళ్తున్నాం అనే విషయాన్ని మాత్రం పట్టించుకోం. మార్కెట్‌లో దొరికే రంగురంగుల డిజైన్లు, తక్కువ ధర చూసి మనం ఎంచుకునే టిఫిన్ బాక్స్‌లు మన ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా భారతీయ ఇళ్లలో ఎక్కువగా కనిపించే స్టీల్ టిఫిన్లే అత్యంత సురక్షితమైనవి. ఇవి రసాయన రహితం, మన్నికైనవి, తేలికగా ఉంటాయి. ఆహారం రుచిని, పోషకాలను ఇవి మార్చవు. వీటిని మైక్రోవేవ్‌లో పెట్టలేము. ద్రవ పదార్థాల కోసం లీక్-ప్రూఫ్ మూతలు ఉన్న వాటినే ఎంచుకోవాలి. స్కూలుకు వెళ్లే పిల్లలకు, ఆఫీసులకు వెళ్లే వారికి ఇది అత్యంత ఉత్తమమైన ఎంపిక. ఆధునిక జీవనశైలిలో గాజు టిఫిన్ల వినియోగం పెరుగుతోంది. గాజు రసాయన రహితమైనది. ఆహారం వాసన రాకుండా ఉంటుంది. ఆఫీసుల్లో నేరుగా మైక్రోవేవ్‌లో వేడి చేసుకోవడానికి ఇది వీలుగా ఉంటుంది. ఇవి బరువుగా ఉంటాయి. కింద పడితే విరిగిపోయే ప్రమాదం ఉంది. జాగ్రత్తగా వాడగలిగే పెద్దలకు, ఆఫీసు ఉద్యోగులకు ఇది మంచిది. పాత కాలంలో ఇత్తడి పాత్రలనే వాడేవారు. దీని వెనుక శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. ఇత్తడిలో ఆహారం ఉంచడం వల్ల శరీరానికి అవసరమైన ఖనిజాలు అందుతాయి. ఇది బాక్టీరియా పెరగకుండా చూస్తుంది. నిమ్మకాయ, టమోటా వంటి ఆమ్ల ఆహారాలతో ఇత్తడి ప్రతిచర్య జరుపుతుంది. అలాగే వీటిని శుభ్రం చేయడం, మెరిసేలా చూసుకోవడం కాస్త కష్టమైన పని. ఇంట్లో ఉండేవారికి, చిన్న ప్రయాణాలు చేసే వారికి ఇది అనుకూలం. చౌకగా దొరుకుతాయని ప్లాస్టిక్ బాక్సుల వైపు వెళ్లడం ఆరోగ్యానికి చేటు. బరువు తక్కువ, రంగురంగుల డిజైన్లలో లభిస్తాయి. వేడి ఆహారాన్ని ప్లాస్టిక్‌లో ఉంచినప్పుడు అది హానికరమైన రసాయనాలను విడుదల చేస్తుంది. ఇది దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉంది. అత్యవసరమైతే తప్ప ప్లాస్టిక్ వాడకపోవడమే మంచిది.

# పొద్దుతిరుగుడు సూపర్ బెనిఫిట్స్..




మహిళల హార్మోన్ల సమతుల్యత, ఋతుక్రమ నొప్పుల ఉపశమనానికి పొద్దుతిరుగుడు విత్తనాలు అద్భుత ఔషధం. వీటిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. చిరాకు, కోపాన్ని తగ్గించి, క్యాన్సర్, గుండె జబ్బుల నుండి రక్షణ కల్పిస్తాయి. ఎముకల బలోపేతానికి, డయాబెటిస్ నియంత్రణకు కూడా సహాయపడతాయి. మహిళల శరీరంలో హార్మోన్ల సమతుల్యతలో అనేక హెచ్చుతగ్గులు ఉంటాయి. వయసు పెరిగే కొద్దీ ఈ మార్పులు వారిని చాలా ఇబ్బంది పెట్టడం ప్రారంభిస్తాయి. దీని కారణంగా వారు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. మహిళలు తరచుగా చిరాకుగా కనిపిస్తుంటారు. చిన్న విషయాలకే కోపంగా ఉండటం ప్రారంభిస్తారు. దీంతో పాటు పీరియడ్స్ సమయంలో తీవ్రమైన కడుపు, వెన్నునొప్పి సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది మహిళలకు ఎక్కువ రోజుల ముందుగానే పీరియడ్స్ నొప్పులు రావడం ప్రారంభిస్తాయి.. అలాంటి మహిళలు సమస్యను ఎలా వదిలించుకోవాలో తెలియక చాలా ఆందోళన చెందుతారు. కానీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. ఎందుకంటే..అటువంటి పరిస్థితుల్లో కొన్ని విత్తనాలు మీకు ఆరోగ్యానిస్తాయి. అందులో ఒకటి పొద్దుతిరుగుడు. పొద్దుతిరుగుడు విత్తనాలు చాలా శక్తివంతమైనవి. దీనిలో ప్రోటీన్, కొవ్వు మంచి పరిమాణంలో ఉంటుంది. అంతేకాదు.. అనేక రకాల విటమిన్లు, జింక్, మాంగనీస్, రాగి, మెగ్నీషియం, ఇనుము, పాంతోతేనిక్ ఆమ్లం వంటివి సమృద్ధిగా లభిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఇతర విత్తనాల కంటే ఎక్కువ విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అంతేకాదు..క్యాన్సర్‌ను నివారించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. థైరాయిడ్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు కూడా పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవాలి. ఇది ఎముకలను బలపరుస్తుంది. కణాల పెరుగుదలకు సహాయపడుతుంది. ఈ విత్తనంలో సరైన మొత్తంలో అయోడిన్, సెలీనియం ఉంటాయి. ఇది థైరాయిడ్ హార్మోన్‌ను సమతుల్యం చేస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలను క్రమం తప్పకుండా తీసుకుంటే అనేక రకాల క్యాన్సర్‌ల నుండి రక్షించుకోవచ్చు. ఈ విత్తనాల్లోని విటమిన్ ఇ క్యాన్సర్ నిరోధకమే కాకుండా గుండెను బలంగా చేయడంలో కూడా చాలా శక్తివంతమైనది. ఇది గుండె నుండి చెడు కొలెస్ట్రాల్‌ను తొలగిస్తుంది. ట్రైగ్లిజరైడ్‌లను కూడా తగ్గిస్తుంది. గుండెలో మంటను నివారిస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలలో అనేక రకాల ఖనిజాలు ఉంటాయి. వాటిలో మెగ్నీషియం, పాంటోథెనిక్ ఆమ్లం ఉన్నాయి. ఇవి కండరాల నొప్పులను తగ్గిస్తాయి. అందువల్ల, కండరాల సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. ఇది శరీరం నుండి ఆక్సీకరణ ఒత్తిడిని తొలగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.



# ప్రతి రోజూ టమోటా తింటే ఏమవుతుంది?

టమోటాలతో ప్రత్యేక సూప్‌లు, సాస్‌లు, చట్నీలను కూడా తయారు చేస్తారు. వంటల రుచిని పెంచే ఈ జ్యుసి టమాటాలు పోషకమైన ఆహారంగా పనిచేస్తాయి. మీ ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. కానీ, ప్రతిరోజూ టమోటాలు తినడం వల్ల మీ శరీరంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? అన్ని కూరగాయల్లో కెల్లా టమాటాది ప్రత్యేక స్థానం. ఎందుకంటే.. వంట ఏదైనా సరే.. టమాటా లేనిదే అసంపూర్ణం అని చెప్పాలి. వివిధ రకాల కూరగాయలు, సలాడ్‌లతో సహా అనేక వంటలలో ఉపయోగిస్తారు. టమోటాలతో ప్రత్యేక సూప్‌లు, సాస్‌లు, చట్నీలను కూడా తయారు చేస్తారు. వంటల రుచిని పెంచే ఈ జ్యుసి టమాటాలు పోషకమైన ఆహారంగా పనిచేస్తాయి. మీ ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. కానీ, ప్రతిరోజూ టమోటాలు తినడం వల్ల మీ శరీరంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? విటమిన్ సి, పొటాషియం, లైకోపీన్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యం, చర్మం, జీర్ణవ్యవస్థకు ఇవి ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో పేరుకుపోయిన మలినాలు బయటకు పోతాయి. రోజూ పచ్చి టమాటా తింటే బీపీ తగ్గడంతో పాటు కొలెస్ట్రాల్ లెవెల్స్ కంట్రోల్ లో ఉంటాయి. ఇమ్యూనిటీ కూడా పెరుగుతుంది. టమాటాలో విటిన్ సి ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరగడానికి ఇది చాలా కీలకం. టమాటా యాంటీ ఆక్సిడెంట్ లా కూడా పని చేస్తుంది. బాడీ సెల్స్ డ్యామేజ్ కాకుండా అడ్డుకుంటుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. స్కిన్ ఎప్పుడూ హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా రక్షిస్తుంది. టమాటాతో జీర్ణ శక్తి పెరుగుతుంది. అందుకు కారణం ఏంటంటే..టమాటాలో ఫైబర్ అధికంగా ఉంటుంది. టమాటాలో విటమిన్ కె సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను బలంగా ఉంచుతుంది. బ్లడ్ క్లాటింగ్ లేకుండా చూస్తుంది.

# వంటగదిలో ఈ తప్పులు చేస్తున్నారా..!



హిందూ ధర్మశాస్త్రం ప్రకారం.. ఇల్లు కేవలం నివాసం మాత్రమే కాదు.. అది శక్తి నిలయం. ముఖ్యంగా ఇంట్లోని వంటగది అత్యంత పవిత్రమైన ప్రాంతం. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఐశ్వర్యం, శ్రేయస్సుకు మూలమైన అన్నపూర్ణేశ్వరి దేవి కొలువయ్యే స్థానం ఇది. అయితే మనం తెలియకుండా చేసే కొన్ని చిన్న తప్పులు వంటగదిలో వాస్తు దోషాలను కలిగించి, తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు, కుటుంబ కలహాలకు దారితీస్తాయని వాస్తు నిపుణులు హెచ్చరిస్తున్నారు. మురికి పాత్రలు: చాలామంది రాత్రి పూట భోజనం చేసిన తర్వాత పాత్రలను కడగకుండా సింక్‌లోనే వదిలేసి, ఉదయాన్నే శుభ్రం చేస్తుంటారు. వాస్తు ప్రకారం ఇది అత్యంత ప్రమాదకరం. రాత్రంతా ఉండే మురికి పాత్రలు ప్రతికూల శక్తిని పెంచుతాయి. ఇది లక్ష్మీదేవి రాకను అడ్డుకోవడమే కాకుండా, ఇంట్లో అనవసర ఖర్చులను పెంచుతుందని వాస్తు శాస్త్రం చెబుతోంది. అగ్ని - నీరు: వంటగదిలో స్టవ్, సింక్ లేదా వాటర్ ట్యాప్ ఒకదానికొకటి చాలా దగ్గరగా లేదా ఒకే వరుసలో ఉండకూడదు. అగ్ని, నీరు విరుద్ధ అంశాలు కావడం వల్ల ఇవి దగ్గరగా ఉంటే దంపతుల మధ్య గొడవలు, అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. మందులు-విరిగిన పాత్రలు: వంటగదిని కేవలం ఆహారానికి మాత్రమే పరిమితం చేయాలి. వంటగదిలో మెడికల్ కిట్‌లు లేదా మందులు ఉంచడం అశుభం. ఇది ఇంట్లోని వారు తరచూ అనారోగ్యం పాలయ్యేలా చేస్తుంది. పగిలిన పాత్రలు ఆర్థిక నష్టానికి, పేదరికానికి సంకేతం. వాటిని వెంటనే తొలగించాలి. స్టవ్ పైన లేదా వంటగదిలో అద్దం, దేవతల ఫోటోలు ఉంచడం వాస్తు విరుద్ధం. శుభప్రదమైన దిశలు: వంట చేసేటప్పుడు ఎల్లప్పుడూ తూర్పు వైపు ముఖం ఉంచడం శ్రేయస్కరం. దక్షిణం వైపు తిరిగి వంట చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. వాస్తు ప్రకారం వంటగది ఆగ్నేయ మూలలో ఉండటం అత్యంత శుభప్రదం. వంటగదిలోకి చెప్పులు ధరించి రావడం వల్ల ఆహార స్వచ్ఛత దెబ్బతింటుంది. వంటగదిని ఎల్లప్పుడూ శుభ్రంగా, గాలి వెలుతురు వచ్చేలా ఉంచుకోవాలి. ప్రతిరోజూ సాయంత్రం వంటగదిలో ఒక చిన్న దీపం లేదా వెలుగు ఉండేలా చూసుకోవడం వల్ల ఇంట్లో సిరిసంపదలు వృద్ధి చెందుతాయని వాస్తు పండితులు సూచిస్తున్నారు.

# ఇటీవల పెరుగుతున్న కొత్త అనారోగ్యం!



సోషల్ మీడియాలో నిమగ్నమైనప్పుడో, వీడియోలు స్క్రోల్ చేస్తున్నప్పుడో ఒక్కసారిగా తలతిరగడం, వికారం, తలనొప్పి వంటి సమస్యలు మీలో తలెత్తుతున్నాయా? అయితే అది సైబర్ సిక్‌నెస్ వల్ల కావచ్చు! అంటున్నారు నిపుణులు. డిజిటల్ పరికరాలను అతిగా ఉపయోగించడంవల్ల వచ్చే మోషన్ సిక్‌నెస్ రకాల్లో ఇదొకటి. మొబైల్, కంప్యూటర్, వర్చువల్ రియాలిటీ హెడ్‌సెట్ వంటివి ఉపయోగిస్తున్నప్పుడు, హెడ్‌సెట్ ధరించి వర్చువల్ ప్రపంచంలో మోషన్ (కదలిక) అనుభవిస్తున్నప్పుడు తలెత్తుతుంది. ఎందుకంటే కళ్లు వర్చువల్‌లో రన్నింగ్, ఫ్లయింగ్ వంటి కదులుతున్న దృశ్యాలను చూస్తుంటాయి. కానీ శరీరం నిజంగా స్థిరంగా ఉంటుంది. ఈ పరిస్థితి మెదడుకు విజువల్ (కళ్లు) అండ్ వెస్టిబ్యులర్ (ఇన్నర్ ఇయర్ బ్యాలెన్స్) సిగ్నల్స్ మధ్య అసమతుల్యతకు, అసమంజసత్వానికి కారణం అవుతుంది. దీనినే సెన్సరీ కాన్‌ఫ్లిక్ట్ అంటారు.నిజానికి కొవిడ్ మహమ్మారి సమయంలో లాక్ డౌన్, భౌతిక దూరం వంటి కారణాలతో రిమోట్ వర్క్, ఆన్‌లైన్ సోషలైజేషన్ పెరిగింది. దీంతో సహజంగానే స్క్రీన్ టైమ్ కూడా పెరిగింది. ఈ పరిస్థితి సైబర్ సిక్‌నెస్‌ను కూడా మరింత ఎక్కువ చేసింది. మొదట వర్చువల్ రియాలిటీలో గుర్తించబడిన ఈ సమస్య, కళ్లు చూసే విజువల్ మోషన్, శరీరం అనుభవించే స్థిరత్వం మధ్య అసమంజసత్వం వల్ల వస్తుంది. ఈ సందర్భంగా నిపుణులు కనుగొన్నారు. దీనినే సెన్సరీ కాన్ఫ్లిక్ట్ థియరీగా పేర్కొన్నారు. అయితే ఇది మరీ కొత్తదేమీ కాదు. పురాతన కాలంలో కూడా మరో రూపంలో మోషన్(కదలిక) సిక్‌నెస్ ఉండేది. ఉదాహరణకు సముద్ర అనారోగ్యం 800 ఃఅఇ నాటిది, కానీ నేటి డిజిటల్ యుగంలో ఇది సోషల్ మీడియా స్క్రోలింగ్, గేమింగ్ వంటి కార్యకలాపాల్లో కనిపిస్తోంది. ఇది నిజమైన కదలిక లేదా స్థానచలనం లేని పరిస్థితుల్లో, కళ్లు మాత్రమే వర్చువల్‌గా కదలికలను చూస్తూ ఉన్నప్పుడు మెదడు గందరగోళానికి గురవుతుంది. దీంతో తలనొప్పి, తల తిరగడం, వికారం వంటివి తలెత్తుతాయి. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లలో నిమగ్నమై పోవడం, సోషల్ మీడియాలో గంటల తరబడి గడపడం ఇందుకు కారణం అవుతున్నదని నిపుణులు చెబుతున్నారు. లాంగ్ స్క్రీన్ టైమ్, ఫాస్ట్ మూవింగ్ కంటెంట్, అలాగే మోషన్ సిక్‌నెస్ హిస్టరీ ఉన్నవారిలో ఈ సమస్య మరింత అధికం అవుతుంది.తలనొప్పి, తల తిరగడం, కళ్లు తిరగడం, కళ్లపై ఒత్తిడి లేదా అలసట, శరీరంపై చెమటలు పట్టడం, వికారం, కొన్నిసార్లు వాంతింగ్స్ అవడం వంటివి సైబర్ సిక్‌నెస్ లేదా మోషన్ సిక్‌నెస్ లక్షణాలుగా పేర్కొనవచ్చు. ఇవి స్క్రీన్ చూడటం ఆపేసిన తర్వాత కూడా కొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చు. సాధారణంగా స్క్రీన్‌టైమ్ తగ్గించడం లేదా లక్షణాలు తగ్గే వరకు డిజిటల్ పరికరాలు, స్క్రీన్‌లకు దూరంగా ఉండటంవంటి నివారణ చర్యలతో సమస్యకు పరిష్కారం లభిస్తుంది. సైబర్‌సిక్‌నెస్‌కు ప్రత్యేక చికిత్స అంటూ ఏదీ లేదు. ఆన్‌లైన్‌లో లేదా సోషల్ మీడియాలో తరచుగా నిమగ్నమయ్యేవారు ప్రతీ 20 లేదా 30 నిమిషాలకు బ్రేక్ తీసుకోవాలి. లేదా 20-20-20 రూల్ ఫాలో కావాలి. అంటే ప్రతీ 20 నిమిషాలకు ఒకసారి 20 సెకన్లు బ్రేక్ తీసుకొని, 20 అడుగుల దూరంలో పరిసరాలను చూడాలి. ముఖ్యంగా స్క్రీన్ టైమ్ తగ్గించంచడం, సరైన దూరం పాటించడం, స్క్రీన్ సెట్టింగ్స్‌లో బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్ తగ్గించడం, మోషన్ స్మూత్‌నెస్ పెంచడం వంటివి నివారణలో భాగమని చెప్పవచ్చు. అలాగే నీళ్లు ఎక్కువగా తాగడంవల్ల బాడీ హైడ్రేటెడ్‌గా ఉండి సిక్‌నెస్ లక్షణాల ప్రభావాన్ని తగ్గిస్తుంది.

# వైభవ్ సూర్యవంశీ విధ్వంసక శతకం..
# కేవలం 63 బంతుల్లోనే సెంచరీ

**మూడో వన్డేలో చెలరేగిన భారత యువ కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ**

**కేవలం 63 బంతుల్లోనే శతకంతో విధ్వంసం**

**గత మ్యాచ్‌లోనూ 24 బంతుల్లో 68 పరుగులు చేసిన వైభవ్**

**ఇప్పటికే 2-0తో సిరీస్ కైవసం చేసుకున్న భారత్**

**క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగిన యంగ్ ఇండియా**



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న యూత్ వన్డే సిరీస్‌లో భారత యువ కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఇప్పటికే 2-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత జట్టు, క్లీన్‌స్వీప్ లక్ష్యంగా ఆడుతున్న మూడో, చివరి వన్డేలోనూ దుమ్మురేపుతోంది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ వైభవ్ కేవలం 63 బంతుల్లోనే విధ్వంసక శతకం బాదాడు.తన ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 8 సిక్సర్లు కొట్టిన వైభవ్.. దక్షిణాఫ్రికా బౌలర్లకు చుక్కలు చూపించాడు. మొత్తంగా 127 రన్స్ చేసి ఔటయ్యాడు. మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్ కూడా రాణిస్తుండటంతో భారత్ వికెట్ నష్టపోకుండా పటిష్ఠ స్థితిలో ఉంది. గత మ్యాచ్‌లోనూ వైభవ్ ఇదే తరహాలో చెలరేగిన విషయం తెలిసిందే.

వర్షం కారణంగా కుదించిన ఆ మ్యాచ్‌లో వైభవ్ కేవలం 24 బంతుల్లో 10 సిక్సర్లతో 68 పరుగులు చేసి ఒంటిచేత్తో జట్టును గెలిపించాడు. ఆ మ్యాచ్‌లో బౌలర్లు కూడా రాణించారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్ కిషన్ సింగ్ 4 వికెట్లు పడగొట్టగా, దక్షిణాఫ్రికా తరపున జాసన్ రౌల్స్ (114) సెంచరీతో పోరాడాడు.

ఈ సిరీస్‌లో కెప్టెన్‌గా, బ్యాటర్‌గా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నాడు. మూడో మ్యాచ్‌లోనూ సెంచరీతో చెలరేగి, 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసే దిశగా జట్టును నడిపిస్తున్నాడు.

# విజయానికి 6 బంతుల్లో 13 పరుగులు..
# గెలిపిస్తావనుకుంటే ఇలా చేశావేంటి వార్నర్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ వరల్డ్ క్రికెట్ లో ఎలాంటి ముద్ర వేశాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా టీ 20 క్రికెట్ లో వార్నర్ మ్యాచ్ విన్నర్. ఓపెనర్ గా బరిలోకి దిగి భారీ ఇన్నింగ్స్ లు ఆడడంలో ఈ ఆసీస్ మాజీ ఓపెనర్ దిట్ట. ఐపీఎల్ లో రెండు సార్లు ఆరెంజ్ క్యాప్ గెలుచుకోవడమే కాకుండా ఈ మెగా టోర్నీలో వన్ ఆఫ్ ది బెస్ట్ ప్లేయర్ గా నిలిచాడు. అంతర్జాతీయ క్రికెట్ కు ఎప్పుడైతే డేవిడ్ రిటైర్మెంట్ ప్రకటించాడో అప్పటి నుంచి ఫామ్ తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోలోని బిగ్ బాష్ లీగ్ ఆడుతూ తన క్రికెట్ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. వార్నర్ ఎంతటి ప్రమాదకర బ్యాటర్ అయినప్పటికీ ప్రస్తుతం ఆ రేంజ్ లో ఆడలేకపోతున్నాడు. బిగ్ బాష్ లీగ్ లో వేగంగా పరుగులు చేయడంలో తడబడుతున్నాడు. సిడ్నీ థండర్ తరపున ఆడుతున్న వార్నర్ మంగళవారం (జనవరి 6) అడిలైడ్ స్ట్రైకర్స్ తో జరిగిన మ్యాచ్ లో తమ జట్టును గెలిపించడంలో విఫలమయ్యాడు. థండర్ విజయానికి చివరి ఓవర్లో 13 పరుగులు అవసరం అయ్యాయి. వార్నర్ చివరి వరకు క్రీజ్ లో ఉండి జట్టు ఆశలను సజీవంగా ఉంచాడు. వార్నర్ క్రీజ్ లో ఉండడంతో ఫ్యాన్స్ థండర్ విజయం ఖాయమనుకున్నారు. అయితే అనుకున్నది ఏమీ జరగలేదు. స్ట్రైకర్స్ బౌలర్ ల్యాక్ వుడ్ ధాటికి పరుగులు చేయలేకపోయాడు. తొలి మూడు బంతుల్లో వార్నర్ కనీసం సింగిల్ తీయలేకపోయాడు. మూడు డాట్ బాల్స్ కావడంతో చివరి మూడు బంతులకు 12 పరుగులు చేయాల్సిన పరిస్థితి. నాలుగో బంతికి సింగిల్ తీశాడు. దీంతో సమీకరణం 2 బంతుల్లో 12 పరుగులకు చేరింది. నాన్ స్ట్రైకర్ లో ఉన్న మెక్ డోనాల్డ్ సిక్సర్ కొట్టడంలో విఫలం కావడంతో మ్యాచ్ అడిలైడ్ గెలిచింది. చివరి బంతికి సింగిల్ రావడంతో ఈ మ్యాచ్ లో అడిలైడ్ స్ట్రైకర్స్ 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. వార్నర్ 51 బంతుల్లో 67 పరుగులు చేసి అజేయంగా నిలిచినప్పటికీ పరాజయం తప్పలేదు. అప్పటివరకు జట్టుకు హీరోలా చివరి వరకు నిలబడిన వార్నర్.. చివర్లో బ్యాట్ ఝులిపించలేక మ్యాచ్ ఓటమికి కారణమయ్యాడు. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన అడిలైడ్ స్ట్రైకర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. ఛేజింగ్ లో థండర్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 157 పరుగులకే పరిమితమైంది.

## బంగ్లాదేశ్ రిక్వెస్ట్‌ను కొట్టిపారేసిన ఐసీసీ.. ఇండియాలో వరల్డ్ కప్ ఆడకపోతే పాయింట్లు కోల్పోయినట్టే!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026కి ఇండియా, శ్రీలంక ఆతిథ్యం ఇస్తున్నాయి. ఫిబ్రవరి 7 నుంచి జరగనున్న ఈ మెగా టోర్నమెంట్ లో బంగ్లాదేశ్ తమ లీగ్ మ్యాచ్ లన్నీ ఇండియాలోనే ఆడాల్సి ఉంది. అయితే ఇండియా, బంగ్లాదేశ్ దేశాల ఉద్రిక్తల పరిస్థితుల నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఇండియాలో వరల్డ్ కప్ ఆడడానికి నిరాకరించింది. భద్రత కారణాలు వంకగా చూపిస్తూ ఇండియా వచ్చి ఆడేది లేదని ఐసీసీకి స్పష్టం చేసింది. తమ మ్యాచ్ లన్నీ శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి వివరించింది. ఐసీసీ మాత్రం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నిర్ణయాన్ని కొట్టిపారేసింది. బంగ్లాకు షాక్ ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

బంగ్లాదేశ్ తమ మ్యాచ్ లన్నీ శ్రీలంకకు మార్చాలనే రిక్వెస్ట్ ను ఐసీసీ కొట్టి పారేసినట్టు సమాచారం. జుగ్రాచీజతీఅఎఅఅటశీ నివేదించడంతో ఇది దాదాపు నిజమని స్పష్టమవుతోంది. టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనాలంటే బంగ్లాదేశ్ ఇండియాకి వెళ్లాల్సి ఉంటుందని.. ఒకవేళ మ్యాచ్ లు ఆడలేకపోతే పాయింట్లు కోల్పోయే ప్రమాదం ఉందని బీసీబీకి ఐసీసీ క్లియర్ గా చెప్పినట్టు వార్తలు వస్తున్నాయి. అయితే ఐసీసీ ఇంకా తమకు అలాంటి అల్టిమేటం ఇవ్వలేదని బీసీబీ చెప్పుకొస్తుంది. మరి ఈ విషయంలో బంగ్లాదేశ్ క్రికెటర్ బోర్డు వెనక్కి తగ్గుతుందో లేదా మ్యాచ్ ఆడకుండా పాయింట్లు కోల్పోతుందేమో చూడాలి.

**అసలేం జరిగిందంటే..?**


2026 టీ20 వరల్డ్ కప్ ఆడేందుకు ఇండియాకు వెళ్లడం ఇష్టం లేదని ఐసీసీకి బంగ్లాదేశ్ ఈమెయిల్ ద్వారా తెలిపింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను ఐపీఎల్ 2026 నుంచి తొలగించిన తర్వాత బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తక్షణమే ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత ఇండియా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుల మధ్య ఉద్రిక్తతను తగ్గించడానికి ఐసీసీ ప్రయత్నాలు చేసింది. 2026 టీ20 ప్రపంచ కప్ లో బంగ్లాదేశ్ ఆడబోయే మ్యాచ్ లను ఇండియా నుంచి శ్రీలంకకు తరలించాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) రిక్వెస్ట్ ను ఐసీసీ ఒకసారి పునరాలోచించమని కోరింది. బీసీబీ తమ విజ్ఞప్తిని వెనక్కి తీసుకోవడానికి ఐసీసీ నుండి సమయం కోరింది.

**ఇండియాలో నాలుగు లీగ్ మ్యాచ్ లు:**

టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ ప్రకారం ఇండియాలో బంగ్లాదేశ్ మొత్తం నాలుగు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మూడు కోల్‌కతాలో ఒకటి ముంబైలో జరగనుంది. ఫిబ్రవరి 7న వెస్టిండీస్, ఫిబ్రవరి 9న ఇటలీ, ఫిబ్రవరి 14న ఇంగ్లాండ్ తో కోల్‌కతాలో మ్యాచ్ లు ఆడనుంది. ఫిబ్రవరి 17న ముంబైలో నేపాల్ తో మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఈ నాలుగు మ్యాచ్ లను శ్రీలంకలో ఆ దేశ క్రీడా మంత్రిత్వ శాఖతో పాటు బంగ్లా క్రికెట్ ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ వివాదంపై అటు ఐసీసీ.. ఇటు బీసీసీఐ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# సింపుల్‌గా క్లాస్ తీస్కున్న అనసూయ


సీనియర్ యాంకర్ గా, నటిగా అనసూయ భరద్వాజ్ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. బుల్లితెర వెండి తెర రెండు చోట్లా రాణిస్తున్న నటి. ముఖ్యంగా హీరోయిన్ ఓరియెంటెడ్ (లేడీ ఓరియెంటెడ్) సినిమాలతోను అనసూయ మెప్పించారు. ఇటీవల వరుసగా పలువురు అగ్ర హీరోల సినిమాల్లో క్యారెక్టర్ నటిగా కనిపిస్తూ, అందరి మన్ననలు పొందారుఅనసూయ గతంలో -కథనం- అనే చిత్రంలో నాయికగా నటించింది. తదుపరి మరికొన్ని పవర్‌ఫుల్ పాత్రలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఫ్లాష్ బ్యాక్ అనే చిత్రంలో అనసూయ ఒక పవర్‌ఫుల్ అండ్ బోల్డ్ పాత్రలో నటిస్తున్నారు. ప్రభుదేవా - రెజినా కసాండ్రాతో కలిసి ఆమె నటించిన ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఓటీటీల కోసం రూపొందుతున్న ఓ రెండు వెబ్ సిరీస్ లలోను అనసూయ నటిస్తోంది. ఇవి నాయికా ప్రధాన క్రైమ్ థ్రిల్లర్లు.ఇటీవల -పుష్ప 2: ది రూల్ - చిత్రంలో అత్యంత ప్రభావం చూపే పాత్ర -దాక్షాయణి-గా నటించింది. దాక్షాయని మోస్ట్ పవర్‌ఫుల్ పాత్రతో మెప్పించారు. అనసూయ సోషల్ మీడియాలో వచ్చే విమర్శలను సైతం లెక్కచేయక తన దారిలో తాను దూసుకుపోతూ ముక్కుసూటి మనిషిగా గుర్తింపు పొందారు. ఇటీవల నటుడు శివాజీతో ఎపిసోడ్స్ లో అనసూయ తీవ్రమైన ఉద్వేగంతో స్పందించారు. తాను కూడా హీరోయిన్ గా నటించాను! అని అనసూయ చేసిన వ్యాఖ్యలకు సోషల్ మీడియాల్లో కౌంటర్లు పడుతున్నాయి. దీనికి అనసూయ క్లాస్ తీస్కుంటూ నిజమైన హీరోయిన్ ఎలా ఉండాలో కూడా చెప్పారు. సత్యం మాట్లాడే ధైర్యం.. సొంత దారిలో నడవడం.. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండటం నిజమైన హీరోయిన్ లక్షణాలు అని విశ్లేషించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.నటుడు శివాజీతో ఎపిసోడ్ లో అనసూయపై చాలా ట్రోలంగ్ జరిగింది. కొన్నిసార్లు ఈ ట్రోలింగ్ ఏ రేంజుకు చేరిపోయింది! అంటే అనసూయ ఆల్మోస్ట్ ఎమోషనల్ అయిపోయి కన్నీటిని ఆపుకోవాల్సిన దుస్థితి కూడా వచ్చింది. ఒక బలమైన వ్యక్తిత్వం ఉన్న మహిళగా అనసూయ ట్రోలర్స్ పనిని ఖండించారు.



# టాప్ 2 ప్లేస్ లో నాగార్జున.. ఈసారీ రెస్పాండ్ అవుతారా?

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో స్టార్ యాక్టర్స్ నెట్ వర్త్ పై రీసెంట్ గా వచ్చిన రిపోర్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. 2025 వరకు హీరోల ఆస్తుల అంచనాలను ఓ జాతీయ మీడియా సంస్థ విడుదల చేయగా.. అందులో టాలీవుడ్ కు చెందిన పలువురు సీనియర్ నటులు టాప్ 10 జాబితాలో చోటు దక్కించుకోవడం విశేషంగా మారింది.

ముఖ్యంగా అక్కినేని నాగార్జున పేరు రెండో స్థానంలో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అయితే ఆ రిపోర్ట్ ప్రకారం, బాలీవుడ్ స్టార్ హీరో షారుఖ్ ఖాన్ దేశంలోనే అత్యధిక సంపద కలిగిన నటుడిగా మొదటి స్థానంలో నిలిచారు. ఆయన నికర ఆస్తుల విలువ సుమారు రూ.12,931 కోట్లుగా అంచనా.షారుక్ తర్వాతి స్థానంలో టాలీవుడ్ కింగ్ నాగార్జున ఉన్నారు. నాగార్జున మొత్తం సంపద దాదాపు రూ.5000 కోట్లుగా ఆ రిపోర్ట్ పేర్కొంది. అనేక మంది బాలీవుడ్ హీరోలు ఉండగా, నాగార్జున రెండో స్థానంలో ఉండటం గమనార్హం. మూడో స్థానంలో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ ఉన్నారు. ఆయన సంపద సుమారు రూ.3225 కోట్లుగా అంచనా.ఆ తర్వాత హృతిక్ రోషన్ (రూ.3100 కోట్లు), అక్షయ్ కుమార్ (రూ.2250 కోట్లు), ఆమిర్ ఖాన్ (రూ.1860 కోట్లు) వరుసగా ఉన్నారు. ఏడో స్థానంలో మన మెగాస్టార్ చిరంజీవి నిలిచారు. ఆయన నికర ఆస్తులు సుమారు రూ.1750 కోట్లుగా నివేదిక వెల్లడించింది. ఆ తర్వాత స్థానాల్లో బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్, టాలీవుడ్ సీనియర్ హీరో వెంకటేష్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉన్నారు.అయితే టాప్ 10లో ఇద్దరు సీనియర్ తెలుగు నటులు, ఒక యంగ్ హీరో ఉండటం టాలీవుడ్ స్థాయిని మరోసారి చాటి చెప్పిందని అభిమానులు అంటున్నారు. అదే సమయంలో ఇలాంటి నెట్ వర్త్ అంచనాలపై గతంలో నాగార్జున స్వయంగా స్పందించిన సందర్భాలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే.ఫోర్బ్స్ వంటి సంస్థలు ఇంతకుముందు విడుదల చేసిన సంపద జాబితాలపై నాగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెలబ్రిటీల ఆస్తులపై వచ్చే లెక్కలు పూర్తిగా నిజమైనవి కావని, చాలా అంశాలు బయటకు రాకపోవడం వల్ల ఇవి కేవలం అంచనాలుగానే ఉంటాయని వ్యాఖ్యానించారు. ఈ లెక్కలు తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని అప్పట్లో అన్నారు.ఇప్పుడు అదే నాగార్జున దేశంలో రెండవ అత్యంత ధనవంతుడైన నటుడిగా నిలవడం ఆసక్తికరంగా మారింది. కొందరు ఆ గణాంకాలు నిజమే కావచ్చని భావిస్తుంటే, మరికొందరు ఇవి ఊహాగానాలేనని అంటున్నారు. యాక్టింగ్ తో పాటు వ్యాపారాలు, నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్ పెట్టుబడులే నాగార్జున సంపదకు కారణమని చెబుతున్నారు. మరి ఇప్పుడు కూడా నాగ్ రెస్పాండ్ అవుతారేమో చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com